
manavishwam.com

# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక MANAVISHWAM TELUGU DAILY




వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 36 | గురువారం, జూలై 23 2026 | పేజీలు - 8 | వెల : 5/-

### 7 వేల మెగావాట్ల షాక్‌నూ తట్టుకున్న

# విద్యుత్ వ్యవస్థ

- వర్షాభావంలోనూ నిరంతరాయ సరఫరా
- దేశంలోనే తొలి విద్యుత్ అంబులెన్స్ సేవలు
- డిస్కంలను అగ్రస్థానంలో నిలబెడతాం: భట్టి



**హనుమకొండ, జూలై 22 (మన విశ్వం):** ఎల్‌నినో ప్రభావంతో వర్షాకాలంలోనే రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఒక్కసారిగా పెరిగి, జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినా తెలంగాణ విద్యుత్ వ్యవస్థ సమర్థంగా నిలిచిందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్

మిగతా 2లో...

### రాహుల్, ప్రియాంక అరెస్టుపై

# రేవంత్ ఆగ్రహం

- విద్యార్థుల గొంతు నొక్కొద్దు!
- కొడంగల్‌లో సీఎం ఆధ్వర్యంలో కాంగ్రెస్ నిరసన
- అరెస్టులు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని విమర్శ
- అదుపులో ఉన్న విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి
- ప్రశ్నపత్రం లీక్‌పై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్




**కొడంగల్, జూలై 22 (మన విశ్వం):** జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో న్యాయం కోరుతూ చేపట్టిన ఆందోళన సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని అరెస్టు చేయడాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విద్యార్థులకు సంఘీభావంగా కొడ ంగల్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పి ంచారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును హరించడం రాజ్యాంగ విలువలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రం లీక్‌తో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని పేర్కొన్న రేవంత్ రెడ్డి, అసలు దోషులను పట్టుకోవాల్సిన ప్రభుత్వం నిరసన వ్యక్తం చేస్తున్న వారిపైనే చర్యలకు దిగడం దురదృష్టకరమని అన్నారు. విద్యార్థులకు న్యాయం చేయడం, లీక్‌కు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నార

**'బలప్రయోగం తగదు'**

శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులపై బలప్రయోగం జరిగిందన్న

మిగతా 2లో...

### బీజేపీ నేతల అరెస్టును ఖండించిన

# కిషన్ రెడ్డి



- కాంగ్రెస్ తీరుపై తీవ్ర విమర్శలు
- నీట్ అంశంపై రాజకీయాలు
- చేస్తున్నారని ఆరోపణ
- దోషులపైకఠిన చర్యలు తప్పవని స్పష్టం


**హైదరాబాద్, జూలై 22 (మన విశ్వం):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు నాయకత్వంలో హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట చేపట్టిన శాంతియుత నిరసనలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు, పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలు చూస్తుంటే 'గురవింద గింజ' సామెత గుర్తుకు వస్తోందని కిషన్ రెడ్డి విమర్శించారు.

మిగతా 2లో...

### రెడ్‌కో డీఈపై

# ఏసీబీ ఉచ్చు

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు
- రూ.27.65 కోట్ల ఆస్తుల గుర్తింపు. 8 చోట్ల సోదాలు
- రూ.20 కోట్ల అపార్ట్‌మెంట్లు.. 2.094 కిలోల బంగారం.. గతంలోనూ లంచం కేసు



**హైదరాబాద్, జూలై 22 (మన విశ్వం):** ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టిన ఆరోపణలపై తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (రెడ్‌కో) డివిజనల్ ఇంజనీర్ ముత్యం వెంకట రమణపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అక్రమాస్తుల కేసు నమోదు చేసింది. బుధవారం ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, బినామీలకు

మిగతా 2లో...

### సీతారామ ఫలితం... కేసీఆర్

# దూరదృష్టికి నిదర్శనం

### మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం, జూలై 22(మన విశ్వం):** సీతారామ ప్రాజెక్టు ఆలోచన నుంచి నిర్మాణ పురోగతి వరకు ప్రతి దశలోనూ కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న దూరదృష్టి నిర్ణయాలు, నిరంతర కృషి ఫలితంగానే ప్రస్తుతం ఖమ్మం జిల్లా రైతులకు సీతారామ ప్రాజెక్టు జలాలు అందుతున్నాయని

మిగతా 2లో...

### ప్రజా సమస్యల పరిష్కారమే

# ప్రభుత్వ లక్ష్యం

- గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి నిర్వహించిన మంత్రి పొంగులేటి
- ఇందిరమ్మ ఇండ్లకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచన
- నీట్ లీకేజీపై ప్రధాని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్



**హైదరాబాద్, జూలై 22 (మన విశ్వం ):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన'ప్రజలతో ముఖా ముఖి ' కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిప త్రాలు స్వీకరించి, అత్యవసర సమస్యలపై అక్కడికక్కడే జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు తమ సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం లేకుండా పోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి వారం మంత్రులు ప్రజలతో నేరుగా సమావేశమై వారి సమస్యలను

మిగతా 2లో...

### ఎల్‌నినో ప్రభావంపై

# నిపుణుల కమిటీ కసరత్తు

- ప్రజాభవన్‌లో తొలి సమావేశం నిర్వహణ
- జిల్లా, మండలాల వారీ వర్షాభావ పరిస్థితులపై సమీక్ష
- అత్యవసర కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన




**తెలంగాణ బ్యూరో, జులై 22(మన విశ్వం):** రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై సమగ్ర అంచనా వేసి వ్యవసాయ, అనుబంధ రంగాల కోసం అత్యవసర కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వం ఇటీవల నియమించిన 27 మంది సభ్యుల బహుళశాఖ నిపుణుల కమిటీ తొలి సమావేశం ప్రజాభవన్‌లో జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి అధ్యక్షతన ఈ భేటీ నిర్వహించారు.

?వాతావరణ మార్పుల నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత, శాస్త్రీయ ప్రణాళికే లక్ష్యంగా ప్రతినిధులు పలు కీలక విషయాలపై చర్చించారు. భారత వాతావరణ శాఖ , ఇక్రిసాట్ , క్రాఫి , నాబార్డ్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, నాబార్డ్, విత్తనాభివృద్ధి సంస్థల

మిగతా 2లో...

# సంపాదకీయం

## ఎజెండాలో నీట్‌పై చర్చ ఎందుకు లేదు !



తప్పు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారినే నిందిస్తారు. వారిమీదే విమర్శలు గుప్పిస్తారు. పాలన బ్రహ్మాండంగా చేస్తుంటే..పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవుతుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వహించుకుని, పక్కగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు. కేంద్రం ఆంధీనంలోని ఎన్‌టిఎ నీట్ నిర్వహణలో ఎందుకు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేపర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరంగంగా ఉరితీయాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే...పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు, కాక్రోచ్ పార్టీ మొదటి డిమాండ్ ఇదే తమ డిమాండ్ అని ప్రకటించింది. ఢిల్లీలో ఆందోళనకు పిలుపును ఇచ్చింది. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు. దీనిపై ప్రధాని స్పందించలేదు. నిరంతరం విదీశీ పర్యటనలతో గడుపుతున్న ప్రధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందే ప్రధాని స్పందించి, సిజెపి నేతలను పిలిచి మాట్లాడడం, నీట్‌పై తీసుకుంటున్న చర్యలను వివరించడం జరిగివుంటే బాగుండేది. నిజానికి సమస్యలను పరిష్కరించడం అన్నది ప్రజల కోసమే కదా. మరి ఎందుకు పెద్దగా స్పందించలేదన్నదే సమస్య. ఇకపోతే కాక్రోచ్ పార్టీ చేస్తున్న ఆందోళనలను హైజాక్ చేసేందుకు కాంగ్రెస్ , రాహుల్ గాంధీ యత్నించారనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలో దూరడం ద్వారా సమస్యకు రాజకీయం పులిమారు. రాహుల్‌కు సమస్యల పట్ల చిత్తశుద్ధి కనిపించడం లేదు. పార్లమెంటులో చర్చించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పెద్దమనిషి రాజకీయ డ్రామాకు తెరతీసారు. ఇకపోతే అధికార పార్టీ నేతలు చేస్తున్న వాదనలో పసలేదు. నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనపై స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇది భారత రాజకీయ చరిత్రలో ఒక చీకటి రోజని పేర్కొంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాంగ్రెస్ ఉల్లంఘించిందని విమర్శించారు. విమర్శించ డానికి ఎన్నయినా చెప్పవచ్చు. నిజానికి నీట్ అంశంపై చర్చను ఎజెండాలో పెట్టివుంటే సమస్య వచ్చి ఉండేది కాదు. ఎందుకు అజెండాలో పెట్టలేదో ముందుగా కేంద్రం వివరణ ఇవ్వాలి. మొత్తంగా ఇప్పుడు తప్పెవరిదంటే..అధికార పార్టీదే అని చెప్పాలి. సమస్యపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. సీజేపీ, కాంగ్రెస్ ధర్నాలతో హైటెన్షన్ నెలకొంది. విద్యార్థులపై లాఠిచార్జ్‌కు నిరసనగా.. ప్రధాని నివాసం దగ్గర 3 గంటలపాటు కాంగ్రెస్ మెరుపుధర్నా నిర్వహించింది. పార్లమెంటు వాయిదా తర్వాత పాదయాత్ర చేసిన కాంగ్రెస్ ఎంపీలు.. నేరుగా ప్రధాని నివాస దగ్గరకు వెళ్లి ధర్నా నిర్వహిచారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని, హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి రాజీనామాకు రాహుల్ డిమాండ్ చేశారు. కాగా.. రాహుల్, ప్రియాంక సహా.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత రాత్రి విడుదల చేశారు. 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై పోలీసుల చర్యలు, కాంగ్రెస్ ధర్నా.. తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. పార్లమెంటులో నీట్ అంశంపై సవివరంగా చర్చించడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల నిరసన చేపట్టారని కేంద్ర మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రజాస్వామ్య చర్చ కన్నా రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించడమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది. ప్రజాస్వామ్య నియమాలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తే మంచిది. సమస్య ఏదైనా చర్చకు అవకావం రావాలి. ఎందుకంటే ఈ మధ్య కాలంలో పార్లమెంటులో సమర్థవంతంగా చర్చలు సాగడం లేదు. సమస్యలపై ప్రస్తావన జరగడం లేదు.ఇందుకు అధికార పక్షానిదే ప్రధాన బాధ్యత. విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలపై ప్రభుత్వం చర్చించాలనుకుంటే ఎందుకు ఎజెండాలో పెట్టలేదో చెప్పాలి. ప్రజాస్వామ్యంలోప్రతిపక్ష పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంటుంది. పార్లమెంటులో చర్చలకు అవకాశం రానప్పుడు ఎవ్వరైనా వీధుల్లోనే నిరసనలు తెలుపుతారు. తాము అనుకున్నట్లుగానే పార్లమెంట్ నడవాలని పాలకపక్షం కోరుకోవడం సరికాదు. ప్రజలకు ఏది అవసరమో అది గుర్తించి, చర్చించి, పరిష్కరిస్తే మంచిది.నీట్‌పై చర్చించి, లీకులు లేకుండా, అన్ని రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకుంటే మంచిది.

## 7 వేల మెగావాట్ల షాక్‌నూ తట్టుకున్న



శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాదాపు 7వేల మెగావాట్ల అదనపు భారాన్ని విజయవంతంగా ఎదుర్కొని రాష్ట్ర ప్రజలకు ఎక్కడా విద్యుత్ కొరత లేకుండా నిరంతరాయ సరఫరా అందించామని చెప్పారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సీఎండీ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాధారణంగా వర్షాకాలంలో రాష్ట్ర గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 11వేల మెగావాట్లు ఉండగా, ఈసారి అది 16,500 మెగావాట్లకు చేరిందని భట్టి తెలిపారు. అదే సమయంలో జలాశయాల్లో నీటి కొరతతో 2వేల మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయినా , ముందస్తు ప్రణాళికలు, ఉద్యోగుల సమన్వయంతో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించామని పేర్కొన్నారు. కాళేశ్వరం, దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాలతో పాటు రైతులు అధికంగా బోరు మోటార్లు వినియోగించడం వల్ల పెరిగిన డిమాండ్‌ను కూడా విజయవంతంగా నిర్వహించామని చెప్పారు.

దేశంలోనే తొలి విద్యుత్ అంబులెన్స్

ప్రజలకు అత్యవసర సేవలు మరింత వేగంగా అందించేందుకు దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో విద్యుత్ అంబులెన్సు సేవలను ప్రారంభించినట్లు భట్టి వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, నిచ్చెనలు, ఇతర అవసరమైన పరికరాలతో పాటు నిపుణులైన సిబ్బందితో ఈ ప్రత్యేక వాహనాలను సిద్ధం చేశామని చెప్పారు. 1912టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు అందగానే కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో సమాచారం వెంటనే సంబంధిత బృందానికి చేరి అత్యవసర మరమ్మతులు చేపట్టే విధంగా వ్యవస్థను రూపొందించినట్లు వివరించారు.

డిస్కంలను దేశంలోనే నంబర్-1గా తీర్చిదిద్దుతాం

డిస్కంల ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసేందుకు అధిక వడ్డీ రుణాలను పునర్వ్యవస్థీకరిస్తున్నామని భట్టి తెలిపారు. ఉత్తర, దక్షిణ తెలంగాణ డిస్కంలను దేశంలోనే అత్యుత్తమ విద్యుత్ పంపిణీ సంస్థలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.గృహజ్యోతి పథకం కింద 53 లక్షల కుటుంబాలకు 53 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తోందని, 30లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 30 లక్షల అవసరమైన సుమారు రూ. 14వేల కోట్ల సబ్సిడీ కూడా ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు.

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని భట్టి తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ. 1.20కోట్ల బీమా సౌకర్యం కల్పించామని, సురక్షితంగా విధులు నిర్వహించేందుకు అవసరమైన భద్రతా పరికరాలు, యూనిఫారాలు అందిస్తున్నామని చెప్పారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత ఆధునికంగా, ప్రజలకు మరింత చేరువగా తీర్చిదిద్దేందుకు సంస్కరణలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## రాహుల్, ప్రియాంక అరెస్టుపై




వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని సీఎం అన్నారు. ప్రజల గొంతును అణచివేసే చర్యలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని, నిరసన తెలిపే హక్కును గౌరవించడం ప్రతి ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత అని స్పష్టం చేశారు.

'విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి'

ఆందోళన సందర్భంగా అదుపులోకి తీసుకున్న విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితి, ప్రస్తుతం ఎక్కడ ఉంచారనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. విద్యార్థుల పట్ల పోలీసులు సంయమనం పాటించాలని సూచించారు.

'పోరాటం కొనసాగుతుంది'

విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి రాజీ పడబోదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించే వరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. కొడంగల్‌లో జరిగిన ఈ నిరసనలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## బీజేపీ నేతల అరెస్టును ఖండించిన

ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని, ఈ వ్యవహారం ఆ పార్టీ దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.నీట్ ప్రశ్నపత్రం అంశంపై



లోక్‌సభలో చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ చర్చకు సహకరించకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని కాంగ్రెస్‌కు సూచించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో బాధ్యులను ఇప్పటికే న్యాయస్థానం ముందు హాజరుపరిచిన విషయాన్ని గుర్తు చేసిన కిషన్ రెడ్డి, దర్యాప్తు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఈ వ్యవహారంలో ఎవరైనా దోషులుగా తేలితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఎలాంటి రాజీ ఉండదని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికతకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో దోషులకు శిక్ష పడేలా కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. రాజకీయ ఆరోపణలకు బదులుగా వాస్తవాల ఆధారంగా చర్చ జరగాలని, ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు చేయవద్దని ఆయన కోరారు.

## రెడ్‌కో డీఈపై ...

చెందిన మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. సోదాల్లో అధికారిక లెక్కల ప్రకారం రూ.27.65 కోట్ల విలువైన ఆస్తులు వెలుగుచూశాయి. ఈ ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్ లో మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ పేర్కొంది.సోదాల్లో శేరిలింగంపల్లి , కూకట్‌పల్లి ప్రాంతాల్లో నాలుగు ఫ్లాట్లు, అంజనేయనగర్‌లో జీం3 వాణిజ్య భవనం, గుత్తల బేగంపేట్‌లో జీం5 వాణిజ్య భవనం ఉన్నట్లు గుర్తించారు. వీటి అధికారిక విలువ సుమారు రూ.5.95 కోట్లుగా నిర్ధారించారు. అంతేకాకుండా మూసాపేట్ అంజనేయనగర్‌లో సుమారు రూ.20 కోట్ల పెట్టుబడితో 10 అపార్ట్‌మెంట్లు నిర్మించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ నిర్మాణాల కోసం ఆయన భార్య పేరిట నమోదైన నాలుగు నిర్మాణ సంస్థల ద్వారా పెట్టుబడులు పెట్టినట్లు అధికారులు గుర్తించారు.

బంగారం.. కార్లు.. బ్యాంకు నిల్వలు

సోదాల్లో 2,094 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.52.02 లక్షల బ్యాంకు నిల్వలు, కియా, మహీంద్రా, బలెనో కార్లు, రూ.30 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మద్యం నిల్వలపై మాదాపూర్ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కేసు నమోదు చేసింది. ఇంకా ఇతర ఆస్తులపై విచారణ కొనసాగుతోందని ఏసీబీ తెలిపింది.

ఇదే అధికారిపై గతంలోనూ కేసు

ముత్యం వెంకట రమణ 2019లో సైబర్‌సిటీ సర్కిల్‌లో డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్)గా పనిచేస్తున్న సమయంలో రూ.25 వేల లంచం స్వీకరిస్తూ ఏసీబీకి చిక్కారు. ఆ సందర్భంగా నిర్వహించిన సోదాల్లో రూ.26.52 లక్షల నగదు, రూ.22.60 లక్షల విలువైన బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసులో చార్జిషీట్ ఇప్పటికే దాఖలై, ప్రస్తుతం కోర్టులో విచారణ కొనసాగుతోంది.ప్రస్తుత అక్రమాస్తుల కేసులో నిందితుడిని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచి రిమాండ్ కోరనున్నట్లు అధికారులు తెలిపారు.

## సీతారామ ఫలితం...

ఆయన స్పష్టం చేశారు.

రోజుకు 1,600 క్యూసెక్కుల నీటి ఎత్తిపోత

ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతిరోజూ సుమారు1,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారంటే, అది నాడు కేసీఆర్ ఆలోచించిన మహత్తర ప్రాజెక్టు కార్యరూపం దాల్చడమేనని పువ్వాడ గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాలోని కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందడం రైతులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని, ఇది జిల్లా వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి పోస్తుందని పేర్కొన్నారు.



రూ.9 వేల కోట్లతో మౌలిక వసతుల నిర్మాణం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు కోసం సాధించిన పురోగతిని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రాజెక్టు పనుల కోసం రూ.9,000 కోట్లకు పైగా నిధులు వెచ్చించాం.

100 కిలోమీటర్లకు పైగా ప్రధాన కాల్వలతో పాటు ఆధునిక పంప్‌హౌస్‌లు, పైప్‌లైన్లు, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలను నిర్మించాం.

అధిక సామర్థ్యం కలిగిన మోటార్లు, భారీ పంపింగ్ వ్యవస్థలు, ఆధునిక యాంత్రిక పరికరాలను ఏర్పాటు చేసి పనుల్లో గణనీయమైన పురోగతి సాధించాం."సీతారామ కేవలం ఒక సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదు... ఇది ఖమ్మం జిల్లా రైతాంగ భవిష్యత్‌ను మార్చే కీలకమైన జీవధార. గతంలో కేవలం వర్షాలపై ఆధారపడిన అనేక ప్రాంతాలకు ఇప్పుడు సాగునీటి భరోసా లభించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని జిల్లా ప్రజలు ఎప్పటికీ మరువరు." అని పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే

పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లకే అధిక వినతులు

ఈసారి నిర్వహించిన కార్యక్రమంలో అధికంగా ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన దరఖాస్తులే వచ్చాయని మంత్రి వెల్లడించారు. పేదలకు గౌరవప్రదమైన గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని చెప్పారు. తొలి విడతలో 4.50లక్షలు, రెండో విడతలో 2.50లక్షలు కలిపి మొత్తం 7లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు.నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని పుట్టి పెరిగిన ప్రాంతంలోనే పేదలకు గృహాలు అందించేందుకు ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని, పైలట్ ప్రాజెక్టుగా 16 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. గతంలో దరఖాస్తు చేసిన వారూ కొత్త విధానంలో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మీ సేవ, వాట్సాప్, అధికారిక వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. భూ సమస్యలకు సంబంధించిన వినతులను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నీట్ లీకేజీపై విమర్శలు నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, వారికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ నాయకులపై లాఠీచార్జి చేయడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా పార్లమెంట్‌ను పదేపదే వాయిదా వేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.

నీట్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేసిన మంత్రి, ప్రజా సమస్యల పరిష్కారం, పేదల సంక్షేమం, విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావంపై

ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన నిపుణులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

23 జిల్లాల్లో లోటు వర్షపాతం

ఈ సందర్భంగా ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో రాష్ట్రంలో అసాధారణ వాతావరణ పరిస్థితులు తలెత్తాయని తెలిపారు. జూన్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 శాతం మేర వర్షపాతం లోటు నమోదైందని వివరించారు. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఏకంగా 23 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు.

మధ్య, తూర్పు ప్రశాంత మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అర డిగ్రీ సెల్సియస్ ఎక్కువగా నమోదు కావడం వల్లే ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడి, నైరుతి రుతుపవనాలు బలహీనపడ్డాయని వివరించారు.

త్వరలోనే ప్రభుత్వానికి సిఫార్సులు

వర్షాభావం ఉన్న జిల్లాలకు సంబంధించిన మండలాలు, పంటల సాగు విస్తీర్ణం, వర్షపాత గణాంకాలతో శాస్త్రీయ విశ్లేషణ సిద్ధం చేశామని ఆయన చెప్పారు. జూలై 17న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. ఈ నిపుణుల కమిటీ ఇచ్చే నివేదిక, సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం తక్షణ నివారణ చర్యలతో పాటు దీర్ఘకాలిక ప్రణాళికలను అమలు చేస్తుందన్నారు. ప్రకృతి వనరుల సంరక్షణ, నీరు-విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణలో రాజకీయ ఉద్రిక్తత

- కరీంనగర్, హైదరాబాద్‌లో పోటాపోటీ ఆందోళనలు
- బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల నిరసనలతో ఉద్రిక్త పరిస్థితులు
- పలు చోట్ల నాయకుల అరెస్టులు

**హైదరాబాద్/కరీంనగర్, జూలై 22 (మన విశ్వం ):** తెలంగాణలో బుధవారం రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించగా, హైదరాబాద్‌లో గాంధీభవన్ ముట్టడికి యత్నించిన బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో రెండు నగరాల్లోనూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు భారీగా బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కరీంనగర్‌లో బండి సంజయ్ కార్యాలయం వైపు కాంగ్రెస్ కార్యకర్తలు దూసుకెళ్లగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో కార్యాలయం ఎదుటే బైఠాయించి కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వద్ద రాహుల్ గాంధీ



చేపట్టిన ఆందోళనకు ప్రతిస్పందనగా బీజేపీ గాంధీభవన్ ముట్టడికి పిలుపునివ్వడం, దానికి ప్రతిగా కాంగ్రెస్ నాయకులు బండి సంజయ్ కార్యాలయం వైపు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. హైదరాబాద్‌లో గాంధీభవన్ ముట్టడికి యత్నించిన తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశాయి.

అరెస్టుల సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గాంధీభవన్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు అదనపు పోలీసు బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. కరీంనగర్‌లో కూడా బండి సంజయ్ కార్యాలయం పరిసరాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకున్నప్పటికీ పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరు పార్టీల కార్యకర్తలను శాంతియుతంగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. రాజధాని హైదరాబాద్‌తో పాటు కరీంనగర్‌లో ఒకే రోజు జరిగిన ఈ పోటాపోటీ నిరసనలు, నాయకుల అరెస్టులు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న పోలీసులు శాంతిభద్రతలకు భంగం కలగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# నీట్ పేపర్ లీక్ అక్రమార్కుడు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలి

- విద్యార్థులపై లాటి చార్జీ అమానుష్యం
- తెలంగాణ ఎస్సి జన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయెందర్,
-వెలిశాల శ్యామ్ మహర్,



**తొర్రూర్ జులై 22( మన విశ్వం) :**నీట్ పేపర్ లీక్ విషయంలో అక్రమార్కుడిగా ఆరోపణలు ఎదుర్కుంటున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలని తెలంగాణ ఎస్సి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయెందర్, రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిన్నటి కాక్రోచ్ ఆందోళన నేటి రైతుల ఆందోళనను ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశంలో రోజు రోజుకు బిజెపి ప్రభుత్వం విద్యార్థులను, రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. భారత విద్యార్థుల హక్కుల కోసం శాంతియుతంగా నిరసనపై దాడి ప్రజాస్వామ్య స్ఫూర్తిపై జరిగిన తీవ్ర దాడిగా పేర్కొన్నారు ఇది దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిస్థితిపై అనేక ప్రశ్నలను వున్నాయి అన్నారు. నీట్ పరీక్షల వ్యవహారంలో న్యాయం కోరుతూ, కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సింది పోయి ప్రభుత్వం పోలీసుల ద్వారా అణచివేత మార్గాన్ని ఎంచుకుంది. ప్రజాస్వామ్యానికి ఏమాత్రం శోభనీయమైనది కాదు ఈ దేశ ప్రజలకు సమాధానాలు కావాలి. నీట్ పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. దేశ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన ఈ సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వీడి విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనలకు సమాధానం చెప్పాలి.అత్యంత ముఖ్యంగా, నీట్ పరీక్షల సంక్షోభంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరగాలి. కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశాన్ని విస్మరించే హక్కు ఎవరికీ లేదు. ప్రజల సమస్యలపై చర్చించడానికే పార్లమెంట్ ఉంది. దేశ యువత భవిష్యత్తుకంటే ముఖ్యమైన అంశం మరొకటి లేదు. తెలంగాణ విద్యరుల పక్షాన పూర్తి మద్దతు కాక్రోచ్ జనతా పార్టీకి ఉంటుందని తెలిపారు.

# హస్తినలో ఘనంగా బోనాలు

- తెలంగాణ భవన్‌లో వైభవంగా ముగిసిన మహోత్సవాలు
- దేశ రాజధానిలో తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా వేడుకలు
- ఆకట్టుకున్న బోనాలు, పోతురాజు విన్యాసాలు,

**న్యూఢిల్లీ, జూలై 22 (మన విశ్వం ):** దేశ రాజధాని న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించిన లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను దేశ రాజధానిలో ప్రతిబింబించిన ఈ ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు, తెలుగు ప్రజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహోత్సవాల చివరి రోజు ఉదయం అమ్మవారికి బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజు విన్యాసాలు, సంప్రదాయ



ఆచారాలు, భక్తుల జైజై ధ్వానాలతో తెలంగాణ భవన్ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏ.పీ. జితేందర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు వేమ్ నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, రామసహాయం రఘురాం రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. దేశ రాజధానిలో గత పన్నెండేళ్లుగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ఘనంగా కొనసాగిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను వారు అభినందించారు.

సాయంత్రం తెలంగాణ భవన్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుమారు 150 మంది తెలంగాణ సాంస్కృతిక శాఖ కళాకారులు డప్పు వాద్యాలు, పోతురాజు విన్యాసాలు, ఒగ్గుడోలు, జానపద నృత్యాలు తదితర కళారూపాలను ప్రదర్శించి తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ఆవిష్కరించారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు బోనాలతో పాల్గొనడంతో తెలంగాణ భవన్ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ మహోత్సవాల్లో ఫోటో ప్రదర్శన, మహంకాళి అమ్మవారి శోభాయాత్ర, బోనాల సమర్పణ, పోతురాజు విన్యాసాలు, జానపద కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దేశ రాజధానిలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పే వేదికగా ఈ ఉత్సవాలు నిలిచాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఉత్సవ కమిటీ ఛైర్మన్ బి. మారుతి యాదవ్ మాట్లాడుతూ మహోత్సవాల విజయవంతానికి సహకరించిన తెలంగాణ ప్రభుత్వం, ప్రత్యేక ప్రతినిధి ఏ.పీ. జితేందర్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ శశాంక్ గోయల్, తెలంగాణ భవన్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కళాకారులు, మీడియా ప్రతినిధులు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. గత పన్నెండేళ్లుగా అందరి సహకారంతో దేశ రాజధానిలో బోనాల మహోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో మరింత వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# హనుమకొండలో కాంగ్రెస్ మహా ధర్నా

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో నిరసన
- పలువురు ఎమ్మెల్యేలు, నాయకుల సంఘీభావం
- నీట్ వ్యవహారంపై కేంద్రం బాధ్యత వహించాలని డిమాండ్



**హనుమకొండ, జూలై 22 (మన విశ్వం ):** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాటల్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశాల్లో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని అన్నారు.శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు విమర్శించారు. ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన శాంతియుత నిరసన హక్కును గౌరవించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే చర్యలు సమర్థనీయం కాదని పేర్కొన్నారు. నిరసనల సందర్భంగా అదుపులోకి తీసుకున్న విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. వారి ఆరోగ్యం, భద్రతపై పూర్తి సమాచారం వెల్లడించాలని, విద్యార్థుల హక్కులను కాపాడే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. విద్యార్థుల ఆశయాలు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.

ప్రజల సమస్యలు, విద్యార్థుల హక్కుల విషయంలో కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు. అన్యాయానికి వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొంటూ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆగదని తెలిపారు. మహా ధర్నాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నీట్ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని నినాదాలు చేస్తూ
నిరసన వ్యక్తం చేశారు.

# చెరువుల అభివృద్ధిపై హైడ్రా దృష్టి

- తమ్మిడికుంట, సున్నం చెరువు పనులపై హైడ్రా సమీక్ష
- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు
- చెరువుల పునరుద్ధరణతో వరద నియంత్రణ, భూగర్భ జలాల పెంపుపై దృష్టి

**హైదరాబాద్, జూలై 22 (మన విశ్వం ):** మాధాపూర్ ఐటీ కారిడార్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువుల అభివృద్ధి పనులను ఆగస్టు మూడో వారంలోపు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఈ రెండు చెరువుల పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన పనుల పురోగతిని సమీక్షించి, నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని సూచించారు. చెరువుల్లోకి వర్షపు నీరు సులభంగా చేరేలా ఇన్‌లెట్లను అభివృద్ధి చేయాలని, చెరువు నిండిన తర్వాత నీరు బయటకు వెళ్లేందుకు ఔట్‌లెట్లను సమర్థంగా ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. వరద ముప్పు లేకుండా శాశ్వత చర్యలు



చేపట్టాలని, చెరువుల చుట్టూ బలమైన బండ్లు నిర్మించి విశాలమైన నడక మార్గాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.సున్నం చెరువు ఆక్రమణల కారణంగా 16.4 ఎకరాలకు పరిమితమై ఉండగా వాటిని తొలగించి 30.5 ఎకరాలకు విస్తరించినట్లు అధికారులు వివరించారు. అలాగే తమ్మిడికుంట చెరువును 16.2 ఎకరాల నుంచి 29.3 ఎకరాలకు విస్తరించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. చెరువుల పునరుద్ధ రణతో వరద నియంత్రణతో పాటు భూగర్భ జలాల పెరుగు దలకు కూడా దోహదం చేస్తుందని కమిషనర్ పేర్కొన్నారు. చెరువుల పరిసరాలను ప్రజలకు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కమిషనర్ సూచించారు. పార్కులు, బహిరంగ వ్యాయామ శాలలు, చిన్నారుల ఆట స్థలాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని చెప్పారు. ఒక చెరువు వల్ల కలిగే పర్యావరణ, సామాజిక ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.చెరువుల్లోకి మురుగునీరు చేరకుండా మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. వర్షాకాలంలో నీటి ప్రవాహం నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, చెరువుల వద్ద ఎలాంటి వరద ముప్పు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆగస్టు మూడో వారానికి తమ్మిడికుంట, సున్నం చెరువులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో హైడ్రా అసెట్ ప్రొటెక్షన్ విభాగం అదనపు కమి షనర్ డి. ఆనంద్‌కుమార్, ఏసీపీ తిరుమల్, చెరువు అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న ప్రతినిధులు,
ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి

- గిరిజన బాలికల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్
- నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలని ఆదేశం
- విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచన




**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 22 (మన విశ్వం ):** ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పోషకాహారం, అన్ని మౌలిక సదుపాయాలు అందేలా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. జూలూరుపాడు మండలం పడమటి నరసాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. తనిఖీలో భాగంగా పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటశాల, విద్యార్థుల వసతి గదులు, పారిశుధ్య నిర్వహణతో పాటు విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.అనంతరం పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించి అల్పాహారం, భోజనం, పాఠ్యపుస్తకాలు, యూని ఫాంలు, వసతి సౌకర్యాలు, పాఠశాలలో ఎదు రవుతున్న సమస్యల గురించి ఆరా తీశారు. విద్యార్థులు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించి మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. గత విద్యా సంవత్సరంలో పాఠశాల పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడాన్ని కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రస్తుత విద్యా సంవత్సరంలో కూడా వంద శాతం ఫలితాలు సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్యా వా తావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా అధికా రులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమానికి సంబ ంధించిన ప్రతి అంశంపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, వసతి సౌకర్యాలు, విద్యార్థుల సంక్షేమంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోందని అధికారులు తెలిపారు.

# విద్యార్థులపై లాఠీచార్జ్ ఖండన

- నీట్ పేపర్ లీకేజీపై కేంద్రంపై మండిపడ్డ కల్వకుంట్ల కవిత బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- విద్యార్థుల ఆందోళనను అణచివేయడంపై తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, జూలై 22 (మన విశ్వం ):** నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తెలంగాణ రక్షణ చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఖండించారు. పరీక్షను సక్రమంగా నిర్వహించలేకపోయిన కేంద్ర ప్రభుత్వం విద్యార్థులపై దాష్టీకానికి పాల్పడిందని ఆమె విమర్శించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్య అని పేర్కొన్నారు. విద్యార్థినులను రోడ్లపై పరుగులు పెట్టించి రక్తం వచ్చేలా కొట్టడం అత్యంత అమానుషమని కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారత్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులతో ఇలాంటి వ్యవహారం చేయడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీసిందని విమర్శించారు. ఈ ఘటనతో ప్రపంచ దేశాల ముందు భారత్ తలదించుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించలేకపోయిన కేంద్ర ప్రభుత్వం విద్యార్థులపై జులుం ప్రదర్శించిందని ఆమె ఆరోపించారు. ప్రశ్నపత్రం లీకేజీ



కారణంగా 25 లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని, 21 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఈ ఘటనలకు బాధ్యత ఎవరు వహిస్తారని, విద్యార్థుల మరణాలకు ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. విద్యార్థులపై పోలీసుల దాష్టీకాన్ని చూసి దేశం మొత్తం నిశ్చేష్టంగా మారిందని కల్వకుంట్ల కవిత అన్నారు. విద్యార్థులపై విరిగిన ప్రతి లాఠీకి, వారు చిందించిన ప్రతి రక్తపు చుక్కకు దేశ ప్రజలు ఓటు రూపంలో సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. విద్యార్థుల పట్ల ఇలాంటి వైఖరిని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని అన్నారు.

నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాణాలు కోల్పోయిన 21 మంది విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. అలాగే విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా నిరాహార దీక్ష చేస్తున్న సోనం వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వం ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదని, వారిని రక్షించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని కల్వకుంట్ల కవిత అన్నారు. విద్యార్థుల సమస్యలను బలప్ర యోగంతో అణచివేయకుండా, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవించే విధంగా పాలన సాగించాలని సూచించారు.

# మృతుడి కుటుంబానికి భరోసా

- దాడిలో మృతి చెందిన మహేష్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి సందర్శన
- ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ



**వరంగల్, జూలై 22 (మన విశ్వం ):** వర్ధన్నపేట నియోజకవర్గంలోని 14 వ డివిజన్ లో దుండగుల దాడిలో మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఆడెపు మహేష్ కుటుంబ సభ్యులను మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి బాధను పంచుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడిన మంత్రి కొండా సురేఖ ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబం తీవ్ర విషాదంలో ఉందని పేర్కొంటూ ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. మృతుడి కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కూడా కుటుంబ సభ్యులను ఓదారుస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారని, నేరానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని నాయకులు పేర్కొన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని వెల్లడించారు. పరామర్శ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మరోసారి మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు.

# చర్లపల్లిలో భద్రతా మాక్ డ్రిల్

- హెచ్‌పీసీఎల్‌లో భద్రతా సన్నాహాల సమీక్ష
- కీలక సంస్థ పరిసరాల్లో విస్తృత తనిఖీలు
- అప్రమత్తతతోనే సురక్షిత సమాజమని పోలీసుల సందేశం



**హైదరాబాద్, జూలై 22 (మన విశ్వం ):** మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో చర్లపల్లిలోని హెచ్‌పీసీఎల్ ప్రాంగణంలో బుధవారం భద్రతా మాక్ డ్రిల్ నిర్వహించారు. కీలక సంస్థల్లో అత్యవసర పరిస్థితులను సవర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం, భద్రతా వ్యవస్థలను పరీక్షించడం లక్ష్యంగా ఈ విన్యాసాలు చేపట్టారు. మాక్ డ్రిల్ సందర్భంగా హెచ్‌పీసీఎల్ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రవేశ ద్వారాల పర్యవేక్షణ, అత్యవసర స్పందన విధానాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. అనుమానాస్పద పరిస్థితులను ఎదుర్కొనే విధానాలపై కూడా సమీక్ష నిర్వహించారు. కీలక సంస్థల భద్రతలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు భద్రతా సిబ్బందికి సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేలా సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు.మాక్ డ్రిల్ ద్వారా భద్రతా వ్యవస్థల సామర్థ్యాన్ని అంచనా వేసి, లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పోలీసు శాఖతో పాటు సంబంధిత సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై కూడా దృష్టి సారిం చారు. ప్రజల భద్రతకు ఎల్లప్పుడూ అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని మల్కాజిగిరి పోలీసులు తెలిపారు. కీలక ప్రభుత్వ, పారిశ్రామిక సంస్థల్లో ఇటువంటి భద్రతా విన్యాసాలను నిరంతరం నిర్వహించడం ద్వారా అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే సన్నద్ధత పెరుగుతుందని పేర్కొన్నారు. సురక్షిత సమాజ నిర్మాణానికి నిరంతర అప్రమత్తతే ప్రధాన ఆయుధమని మల్కాజిగిరి పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు కూడా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి భద్రతా చర్యల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

# పెరుమాళ్ల స్వామి ప్రాంతంలో తనిఖీలు



- అల్వాల్‌లో పౌర సమస్యలపై కమిషనర్ సమీక్ష
- ఆక్రమణలు, వ్యర్థాల తొలగింపునకు ఆదేశాలు
- 15 రోజుల్లో పురోగతిపై మళ్లీ తనిఖీ

**హైదరాబాద్, జూలై 22 (మన విశ్వం ):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అల్వాల్ పరిధిలోని పెరుమాళ్ల స్వామి ప్రాంతంలో విస్తృతంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్వాల్ డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ ఇంజినీర్, సహాయ కమిషనర్, పట్టణ జీవవైవిధ్య విభాగం అధికారులు, బిల్లు కలెక్టర్‌తో కలిసి పౌర సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల సందర్భంగా నిర్మాణ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్, వాటిని వెంటనే తొలగించి అమలు నివేదిక సమర్పించాలని సహాయ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఎక్కడా నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాణిజ్య అనుమతులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించేలా కార్యాచరణ రూపొందించాలని, దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చూడాలని పేర్కొన్నారు.
ప్రాంతంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి దానిపై కార్యాచరణ నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. పచ్చదనాన్ని పెంపొందించే చర్యలతో పాటు ప్రజల ఫిర్యాదు మేరకు రహదారిపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. పౌర సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువు లోపు అన్ని పనులు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ప్రతి సమస్యను ప్రాధాన్యంగా తీసుకుని ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఇచ్చిన ఆదేశాల అమలును సమీక్షించేందుకు 15 రోజుల అనంతరం ఇదే ప్రాంతంలో మరోసారి తనిఖీ నిర్వహిస్తామని కమిషనర్ ప్రకటించారు. పనుల పురోగతి, అధికారుల బాధ్యతాయుతమైన పనితీరును పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# హెటెరోతో ఇంటర్ విద్యాశాఖ ఒప్పందం

- విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాల కల్పన
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు పరిశ్రమలతో అనుసంధానం
- 300కుపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్న హెటెరో




**హైదరాబాద్, జూలై 22 (మన విశ్వం ):** తెలంగాణ ప్రభుత్వ ఇంటర్ విద్యాశాఖ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో హెటెరో ఔషధ తయారీ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. పరిశ్రమలు--విద్యాసంస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి విద్యార్థుల ఉద్యోగ అవ కాశాలను పెంపొందించడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ అవగాహన ఒప్పంద పత్రాల మార్పిడి కార్యక్రమం ఇంటర్ విద్యాశాఖ సంచాలకురాలు అభిలాష అభినవ్ సమక్షంలో జరిగింది. కార్యక్రమంలో ఇంటర్ విద్యాశాఖ సంయుక్త సంచాలకుడు యెంక్యా నాయక్, రాష్ట్ర వృత్తి విద్యా సంస్థ ప్రిన్సిపాల్ జ్యోత్స్నారాణి, హెటెరో సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. వెంకట జయపాల్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు మాధురి, కర్ణకంటి వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.ఈ ఒప్పందం ప్రకారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, వృత్తి విద్య కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు పరిశ్రమల సందర్శనలు, ప్రాంగణ నియామకాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, శిక్షణా కార్యక్రమాలు, అధ్యాపకులకు పరిశ్రమల అనుభవం, ప్రయోగశాలల అభివృద్ధికి సహకారం, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ముఖ్యంగా జీవశాస్త్రం, అనుబంధ విభాగాల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా ఎక్కువ ప్రయోజనం కలగనుంది. ఈ సందర్భంగా అభిలాష అభినవ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి కల్పించే దిశగా ఈ ఒప్పందం కీలక ముందడుగని అన్నారు. ఔషధ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడం ద్వారా విద్యార్థులకు దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు.
హెటెరో ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. వెంకట జయపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ యువత ఉపాధి అవకాశాలను మెరుగుపర్చే ప్రభుత్వ లక్ష్యానికి తమ సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. ఈ భాగస్వామ్యం ద్వారా ఇంటర్ అర్హత కలిగిన యువతకు 300కుపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. వృత్తి విద్యను మరింత బలోపేతం చేయడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడం, యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ భాగస్వామ్యాన్ని ఇంటర్ విద్యాశాఖ కీలక కార్యక్రమంగా భావిస్తోంది. పరిశ్రమలు--విద్యాసంస్థల భాగస్వామ్యంతో తెలంగాణ యువతకు మరింత మెరుగైన భవిష్యత్తు నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

# హుస్నాబాద్‌లో మహా ధర్నా

- రాహుల్, ప్రియాంక అరెస్టులను ఖండించిన మంత్రి పొన్నం
- నీట్ పేపర్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చకు డిమాండ్
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్




**హుస్నాబాద్, జూలై 22 (మన విశ్వం ):** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకుల అరెస్టులను నిరసిస్తూ హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌక్ వద్ద రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ప్రజల గొంతును అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు.
నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించి, పూర్తి స్థాయి దర్యాప్తునకు ఆదేశించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం కాకుండా వారి సమస్యలకు న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడే పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని తెలిపారు.
ధర్నాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై పారదర్శక విచారణ జరిపి బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు.

# విద్యార్థులతో మంత్రి పొన్నం ముఖాముఖి

- ఛాత్రోంకి గూంజ్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం
- హాస్టల్ విద్యార్థులతో సమస్యలు, భవిష్యత్‌పై చర్చ
- విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా




**హనుమకొండ, జూలై 22 (మన విశ్వం ):** హనుమకొండ జిల్లా ఇందిరానగర్‌లోని బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ హాస్టల్‌లో నిర్వహించిన ఛాత్రోంకి గూంజ్ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలు, విద్య, వసతి, ఇతర అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభిప్రాయాలు, సూచనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, అవసరమైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యమని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.
ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, సంక్షేమ హాస్టళ్లలో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ విద్యాభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని సృష్టించేందుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, విద్యార్థులు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకుని పలు అంశాలపై చర్చించారు.విద్యార్థుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు బలోపేతమే రాష్ట్ర అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

- సైబర్ నేరాల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం ఎవరికీ ఇవ్వొద్దని హెచ్చరిక
- అనుమానాస్పద సందేశాలు, లింకులపై స్పందించవద్దని విజ్ఞప్తి




**హైదరాబాద్, జూలై 22 (మన విశ్వం ):** సైబర్ నేరాలు రోజురోజుకూ కొత్త రూపాల్లో పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు సూచించారు. సైబర్ మోసగాళ్లు ఫోన్ కాల్స్, సందేశాలు, సామాజిక మాధ్యమాలు, నకిలీ వెబ్‌సైట్ల ద్వారా ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తులు పంపే లింకులు, సందేశాలు, దరఖాస్తులు లేదా బహుమతుల పేరుతో వచ్చే ఆఫర్లను నమ్మవద్దని పోలీసులు హెచ్చరించారు. ముఖ్యంగా బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, ఏటీఎం కార్డు సంఖ్య, సీవీవీ, సంకేతపదాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. సైబర్ మోసాలకు గురికాకుండా ఉండాలంటే అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే సంబంధిత బ్యాంకును సంప్రదించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. డిజిటల్ లావాదేవీల సమయంలో అధికారిక వెబ్‌సైట్లు, ధ్రువీకరించిన దరఖాస్తులనే ఉపయోగించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరాల పద్ధతులు కూడా మారుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, కూరియర్, విద్యుత్ బిల్లు, బహుమతులు, పోలీసు లేదా ప్రభుత్వ అధికారుల పేరుతో వచ్చే మోసపూరిత సందేశాల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సైబర్ నేరాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ పోలీసులు నిరంతరం ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి పౌరుడు సైబర్ భద్రతను వ్యక్తిగత బాధ్యతగా భావించి జాగ్రత్తలు పాటిస్తేనే మోసాలను అరికట్టడం సాధ్యమవుతుందని తెలంగాణ పోలీసులు పేర్కొన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ఆర్థిక నష్టానికి దారితీయవచ్చని హెచ్చరిస్తూ, అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి ఉత్తమ రక్షణ అని సూచించారు.

# ఎవరెస్టు యాత్రకు ఘన వీడ్కోలు

- పర్వతారోహకులను సాగనంపిన కలెక్టర్
- జిల్లా యంత్రాంగం తరపున ఘన సత్కారం
- విజయవంతంగా తిరిగి రావాలని ఆకాంక్ష



**ఆదిలాబాద్, జూలై 22 (మన విశ్వం ):** ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించేందుకు పయనమవుతున్న పర్వతారోహకులు మాడవి కన్నీబాయి, కాట్లే ఆనందరావులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం జిల్లా కేంద్రీయ ఐటీడీఏ సముదాయం నుంచి జెండా ఊపి ఘనంగా సాగనంపారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం తరపున ఇద్దరు పర్వతారోహకులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడం ప్రతి పర్వతారోహకుడి జీవితంలో అత్యున్నత లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయి సాహస యాత్రకు వెళ్తున్న వీరు యువతకు ఆదర్శంగా నిలుస్తారని, వారి విజయం జిల్లా ఖ్యాతిని మరింత పెంచుతుందని అన్నారు. మాడవి కన్నీబాయి, కాట్లే ఆనందరావులు కఠోర శ్రమ, అంకితభావంతో ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారని కలెక్టర్ కొనియాడారు. శారీరక, మానసిక దృఢత్వంతో సాహస యాత్రను విజయవంతంగా పూర్తి చేసి సురక్షితంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

జిల్లా యంత్రాంగం, ప్రజల ఆశీస్సులు తమ వెంట ఉంటాయని పేర్కొంటూ పర్వతారోహకులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. పర్వతారోహణ వంటి సాహస క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం, సాహసస్ఫూర్తి పెంపొందుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఇటువంటి ప్రతిభావంతులకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు నిసార్ వసంతరావు, బత్రం భాస్కర్, డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి గడ్డం చంద్రశేఖర్, జగన్, గిరిజన క్రీడల అధికారి పార్ధసారథి, ప్రత్యేక విధుల అధికారులు మేస్రం, టి. దేవురావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని పర్వతారోహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# శుద్ధ జల కేంద్రం ప్రారంభం

- శాంతినగర్‌లో వజ్రం ప్యూర్ ఫైర్ కేంద్రం ప్రారంభం
- సురక్షిత తాగునీటి అందుబాటుకు మరో అడుగు
- కలెక్టర్, ఎమ్మెల్యే సంయుక్తంగా ప్రారంభించిన కేంద్రం



**ఆదిలాబాద్, జూలై 22 (మన విశ్వం ):** ఉట్నూర్ మండలంలోని శాంతినగర్ గ్రామంలో నంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "వజ్రం ప్యూర్ ఫైర్" శుద్ధ జల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి బుధవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో స్వచ్ఛమైన తాగునీరు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులను నివారించడంలో ఇలాంటి శుద్ధ జల కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు కృషి కొనసాగుతుందని చెప్పారు.

నంది ఫౌండేషన్ ప్రతినిధులు శుద్ధ జల కేంద్రం నిర్వహణ, నీటి శుద్ధి ప్రక్రియ, ప్రజలకు అందించే సేవలపై వివరించారు. గ్రామ ప్రజలకు తక్కువ వ్యయంతో నాణ్యమైన తాగునీరు అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఈ కేంద్రం దోహదపడుతుందని తెలిపారు. గ్రామస్తులు శుద్ధ జల కేంద్రం ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పోలీసు అధికారి ఋత్విక్ సాయి కోటే, మండల అభివృద్ధి అధికారి రాయిస్ ఉద్దీన్, నంది ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక సర్పంచ్ అనిత, మహిళా సమాఖ్య సభ్యులు, గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సురక్షిత తాగునీటి సౌకర్యాల విస్తరణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

# విద్యార్థులకు ఎస్పీ ప్రోత్సాహం

- చర్ల మండలంలో ప్రాథమిక పాఠశాల ప్రారంభించిన ఎస్పీ
- విద్యార్థులకు పాఠశాల సంచుల పంపిణీ
- ఆరోగ్యం, రహదారి భద్రతపై అవగాహన



**కొత్తగూడెం, జూలై 22 (మన విశ్వం ):** విద్యే భవిష్యత్తుకు బలమైన పునాదని పేర్కొంటూ జిల్లా పోలీసు అధికారి రోహిత్ రాజు చర్ల మండలంలోని బక్కచింతలపాడు గ్రామంలో నూతన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థులతో మమేకమై విద్య ప్రాధాన్యతను వివరించారు. పాఠశాల ప్రారంభోత్సవం అనంతరం విద్యార్థులకు పాఠశాల సంచులను పంపిణీ చేశారు. ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని తమ కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

గ్రామస్తులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై ఎస్పీ ప్రత్యేకంగా వివరించారు. ముఖ్యంగా వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిల్వ నీరు ఉండకుండా చూడాలని సూచించారు. రహదారి భద్రతపై కూడా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని, వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యతో పాటు సామాజిక చైతన్యం పెంపొందించడం కూడా ఎంతో అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. పోలీసులు ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు సమాజాభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, రహదారి భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని
అధికారులు తెలిపారు.

# బాసర ఐఐఐటీలో నైపుణ్యాలకు ప్రాధాన్యం

- ఉపాధి అవకాశాలపై కలెక్టర్ దృష్టి
విద్యా ప్రణాళికలను
- మెరుగుపరచాలని సూచన
- ఐఐఐటి క్యాంపస్‌లో సమీక్ష సమావేశం



**నిర్మల్, జూలై 22 (మన విశ్వం ):** బాసర భారతీయ సమాచార సాంకేతిక విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులు విద్య పూర్తిచేసి బయటకు వెళ్లే సమయానికే మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందేలా నైపుణ్యాభివృద్ధి ఆధారిత విద్యాబోధన చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం బాసర ఐఐఐటి క్యాంపస్‌ను సందర్శించిన కలెక్టర్ విశ్వవిద్యాలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, సమాచార వినిమయ నైపుణ్యాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన సామర్థ్యాలను పెంపొందించేలా విద్యా ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు ఉద్యోగ విపణిలో పోటీపడే నైపుణ్యాలను కూడా అలవరచుకునేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలను ఎప్పటికప్పుడు నవీకరించాలని, విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ, పరిశ్రమల అనుసంధానం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. దీనివల్ల విద్య పూర్తయ్యే సమయానికే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. సాంకేతిక విద్యతో పాటు నాయకత్వ లక్షణాలు, సమస్యల పరిష్కార సామర్థ్యం, సమాచార వినిమయ నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించే దిశగా నిరంతరం కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో భైంసా ఉప కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఐఐఐటి ఉపకులపతి గోవర్ధన్, ప్రత్యేక విధుల అధికారి మురళీ దర్శన్, తహసీల్దార్ పవన్ చంద్ర, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉపాధి ఆధారిత విద్యా విధానాలను మరింత సమర్థంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# ప్రత్యేక ఓటరు సవరణ పరిశీలన

- ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పరిశీలించిన కలెక్టర్
- ఆగస్టు 3లోపు ఫారాలు సమర్పించాలని సూచన
సేకరణ, డిజిటైజేషన్ వేగవంతం చేయాలని ఆదేశం



**జగిత్యాల, జూలై 22 (మన విశ్వం ):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను పరిశీలించి ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతి అర్హత కలిగిన ఓటరు ఆగస్టు 3లోపు ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బూత్ స్థాయి అధికారులకు అందజేయాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, నిర్దేశించిన గడువులోగా ఫారాలు సమర్పించాలని కోరారు. ఫారాలు నింపే సమయంలో ఏవైనా సందేహాలు ఎదురైతే బూత్ స్థాయి అధికారులు లేదా ఎన్నికల అధికారులను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. సరైన వివరాలతో ఫారాలను నింపడం ద్వారా ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో సిద్ధమవుతుందని పేర్కొన్నారు.

చిరునామా మారిన వారు లేదా వేరే ప్రాంతంలో ఓటు నమోదై ఉన్న వారు ఆ వివరాలను ఫారంలో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. అవసరమైన సమాచారం ఇవ్వకపోతే ఓటరు జాబితా నుంచి పేరు తొలగిపోయే అవకాశం ఉండవచ్చని ప్రజలను అప్రమత్తం చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సేకరించిన వివరాల డిజిటైజేషన్‌ను కూడా త్వరితగతిన పూర్తి చేసి ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులను తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ విజయవంతం కావాలంటే అధికారులు, బూత్ స్థాయి సిబ్బందితో పాటు ప్రజలు కూడా పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ కోరారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సందీప్ కుటుంబానికి రాజ్‌గోపాల్ పరామర్శ

- ప్రమాదంలో మృతిచెందిన సందీప్‌కు నివాళి
- యాదయ్య దంపతులను ఓదార్చిన మునుగోడు ఎమ్మెల్యే
- రాజకీయాలకు అతీతంగా మానవత్వంతో వచ్చానన్న రాజ్‌గోపాల్



**యాదాద్రి భువనగిరి, జూలై 22 (మన విశ్వం ):** మోత్కూరు మండలం దత్తప్పగూడెంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందిన మాజీ ఎంపీటీసీ ఎలుగు యాదయ్య, పార్వతమ్మ దంపతుల కుమారుడు సందీప్ నివాసానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వెళ్లి నివాళులర్పించారు. సందీప్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం యాదయ్య దంపతులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా తీవ్ర భావోద్వేగానికి గురైన రాజ్‌గోపాల్ రెడ్డి, యాదయ్య కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నల్గొండ జిల్లా ఎమ్మెల్సీగా పనిచేసిన రోజుల నుంచే యాదయ్యతో తనకు సన్నిహిత పరిచయం ఉందని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఆయన ఎంతో నిబద్ధతతో పనిచేశారని పేర్కొన్నారు.సందీప్ ఎంతో మంచివాడని, అతను ప్రమాదంలో మరణించడం అత్యంత దురదృష్టకరమని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. ప్రమాదం జరిగిన క్షణం నుంచి అతడిని కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోవడం బాధాకరమని చెప్పారు. సందీప్ మృతి తన కుటుంబ సభ్యుడిని కోల్పోయినంత బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కుమార్తెను, ఇప్పుడు కుమారుడిని కోల్పోయిన యాదయ్య, పార్వతమ్మ దంపతుల బాధ వర్ణనాతీతమని ఎమ్మెల్యే అన్నారు. అలాంటి దుఃఖాన్ని ఎవ్వరూ తీర్చలేరని, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పేందుకే తాను వచ్చానని తెలిపారు. ఈ పరామర్శలో ఎలాంటి రాజకీయాలు లేవని స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎవరూ ఆందోళన చెందవద్దని రాజ్‌గోపాల్ రెడ్డి సూచించారు. అందరూ సమన్వయంతో, ఐకమత్యంతో కలిసి పనిచేయాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు. సందీప్‌కు నివాళులర్పించి, యాదయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఈ కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## సీసీటీవీ నెట్‌వర్క్ బలోపేతం



- "నేను సైతం" కార్యక్రమంపై సమీక్ష నిర్వహించిన సీపీ
- జియో ట్యాగింగ్, కేంద్ర పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి
- ప్రజల భాగస్వామ్యంతో భద్రతా వ్యవస్థ విస్తరణకు చర్యలు

**హైదరాబాద్, జూలై 22 (మన విశ్వం ):** "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆధ్వర్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల జియో ట్యాగింగ్ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యంతో సీసీటీవీ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసి భద్రతా వ్యవస్థను ఆధునికీకరించే అంశాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న సీసీటీవీ వ్యవస్థ పనితీరును సమీక్షించిన సీపీ, డిజిటల్ వీడియో రికార్డర్ల స్థానంలో నెట్‌వర్క్ వీడియో రికార్డర్లను ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా నిఘా వ్యవస్థ సామర్థ్యం మరింత పెరుగుతుందని తెలిపారు.సీసీటీవీ కెమెరాల జియో ట్యాగింగ్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని సీపీ ఆదేశించారు. కెమెరాల ఖచ్చితమైన స్థాన వివరాలు నమోదు చేయడం వల్ల అవసరమైన సమయంలో పర్యవేక్షణ, విచారణ ప్రక్రియలు మరింత వేగంగా నిర్వహించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అన్ని సీసీటీవీ కెమెరాలను కేంద్ర స్థాయి పర్యవేక్షణ వ్యవస్థతో అనుసంధానం చేసే చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమగ్ర పర్యవేక్షణ ద్వారా నేరాల నివారణతో పాటు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని వివరించారు.

ప్రజల భాగస్వామ్యంతో సీసీటీవీ నెట్‌వర్క్‌ను విస్తరించడం పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని డాక్టర్ ఎం. రమేష్ తెలిపారు. వ్యాపార సంస్థలు, నివాస సముదాయాలు, ప్రజా ప్రదేశాల్లో మరిన్ని సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రజలు ముందుకు రావాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ ప్రజల సహకారంతో సురక్షిత సమాజ నిర్మాణానికి సైబరాబాద్ పోలీసులు కట్టుబడి ఉన్నారని సీపీ స్పష్టం చేశారు. "నేను సైతం" కార్యక్రమం ద్వారా భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసి నేరాల నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## 'మీ సురక్ష--సహచరి'పై అవగాహన

- స్వయం సహాయక సంఘం సభ్యుల పోలీస్ స్టేషన్ సందర్శన
- సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన
- ప్రజల భాగస్వామ్యంతో సురక్షిత సమాజ నిర్మాణమే లక్ష్యం



**హైదరాబాద్, జూలై 22 (మన విశ్వం ):** మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మీ సురక్ష--సహచరి" కార్యక్రమంలో భాగంగా కొత్తపేట్ ప్రాంతానికి చెందిన "శ్రీ వైష్ణవి ఏఎల్ఎఫ్ఎస్" స్వయం సహాయక సంఘం సభ్యులు చైతన్యపురి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు వారికి పోలీస్ స్టేషన్ విధులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. సందర్శన సందర్భంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరంపై సభ్యులకు అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, మోసపూరిత వెబ్‌సైట్లు, నకిలీ పెట్టుబడి పథకాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు.

మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, యువతపై వాటి ప్రభావం, సమాజంపై కలిగే ప్రతికూల పరిణామాల గురించి కూడా వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈవ్ టీజింగ్ వంటి ఘటనలను అరికట్టేందుకు మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన సహాయ కేంద్రాల నంబర్లు, మహిళల భద్రతకు అందుబాటులో ఉన్న సేవల గురించి కూడా సభ్యులకు అవగాహన కల్పించారు. మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ ప్రజలకు చేరువయ్యే లక్ష్యంతో "మీ సురక్ష--సహచరి" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై భద్రత, చట్టాలపై అవగాహన పెంపొందించడం ద్వారా నేరాల నివారణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో బాధ్యతాయుతమైన పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి సురక్షిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను వివిధ ప్రాంతాల్లో నిరంతరం నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంపొందించేందుకు చర్యలు కొనసాగిస్తామని వెల్లడించారు.

# నీట్ పరీక్షను పూర్తిగా రద్దు చేయడమే ఏకైక పరిష్కారం



**దిల్లీ:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యార్థులు, ప్రజల మనోభావాలను కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా గౌరవించాలని తమిళనాడు సీఎం విజయ్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను పూర్తిగా రద్దు చేయడమే ఈ సమస్యకు ఉన్న ఏకైక పరిష్కారమని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీక్ అంశంపై దిల్లీలో ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళనకు విజయ్ తన పార్టీ తరఫున మద్దతు ప్రకటించారు. దిల్లీలో నిరసన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా ఇతర నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించిన విజయ్, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని చెప్పారు. నీట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని తాము ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నామని విజయ్ పునరుద్ఘాటించారు. వైద్యవిద్యను రాష్ట్ర జాబితాలో చేర్చడం ఈ సమస్యకున్న శాశ్వత పరిష్కారమని వెల్లడించారు. ఇందుకు న్యాయపరంగా ఏవైనా అడ్డంకులుంటే వాటిని తొలగించే వరకు తాత్కాలికంగా ప్రత్యేక విధానాన్ని తీసుకురావాలని విజయ్ సూచించారు.'నీట్? వంటి పరీక్షలను రద్దు చేయాలంటే, ముందుగా విద్యారంగాన్ని 'రాష్ట్ర జాబితా' పరిధిలోకి మార్చాలి. అదే ఏకైక శాశ్వత పరిష్కారం. ఒకవేళ దీనికి ఏవైనా చట్టపరమైన లేదా విధానపరమైన అడ్డంకులు ఉంటే, రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పించేందుకు మధ్యంతర చర్యగా ఒక 'ప్రత్యేక ఉమ్మడి జాబితా'ను రూపొందించాలి. దీనివల్ల సాధారణ, వైద్య విద్యతో సహా వివిధ అంశాలపై రాష్ట్రాలు పూర్తి అధికారాన్ని వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. శాశ్వత, మధ్యంతర పరిష్కారాల విషయంలో మా దృక్పథం ఇదే. మా పార్టీ ఆవిర్భావ సమయంలో విద్యా పురస్కారాల ప్రదానోత్సవంలోనే ఈ విషయాన్ని బలంగా నొక్కి చెప్పాం.'- విజయ్, తమిళనాడు ముఖ్యమంత్రివిద్యార్థుల అరెస్టుతో భగ్గుమన్న విపక్షాలుఇక, పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ గత కొద్దిరోజులుగా దిల్లీలోని జంతర్మంతర్ వద్ద నిరసన చేపట్టింది. అయితే, ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. దీంతో సీజ్జపీ చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర రూపం దాల్చింది. చలో పార్లమెంటుకు సీజేపీ పిలుపునివ్వడంతో సోమవారం నాటికి వేల మంది దిల్లీకి చేరుకున్నారు. సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఆ ప్రాంతమంతా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వారిని అడ్డుకునేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణ వాతావరణంతో పలుచోట్ల పోలీసులు, ఇటు ఆందోళనకారులు గాయపడ్డారు. అయితే, ఈ తీవ్రమైన ఘర్షణ వాతావరణంతో ఆ ప్రాంతంలో చాలా మందికి రక్తమోడుతున్న వీడియోలు వైరలయ్యాయి. మరోవైపు, నిరసనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర ప్రభుత్వం సీజేపీతో చర్చలు జరిపింది. కేంద్ర మంత్రి నడ్డాతో జరిగిన చర్చల్లో తమ డిమాండ్లపై సానుకూల స్పందన వచ్చినట్లు సీజేపీ తెలిపింది. అయితే, ఈ డిమాండ్లలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కీలకం కావడం గమనార్హం. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కీలకం కావడం ఇక ఆందోళనలకు కేంద్ర బిందువుగా నిలిచిన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కలిసి సుదీర్ఘంగా చర్చలు జరిపినట్లు తెలిసింది. అయితే అందుకు సంబంధించిన వివరాలేమీ తెలీలేదు.మరోవైపు, శాంతియుతంగా నిరసనలు చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. ట్విట్టర్ వేదికపై కేంద్రప్రభుత్వాన్ని విమర్శిస్తూ పోస్టులు పెడుతున్నాయి. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, బంగాల్? మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తదితర ప్రముఖులు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

# నీట్ పేపర్ లీక్‌పై పాట్నాలో విద్యార్థుల నిరసన హింసాత్మకం



**పాట్నా:** నీట్ పేపర్ లీక్ అంశం దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. తాజాగా పాట్నాలో పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా విద్యార్థులు నిరసన చేపట్టగా అది హింసాత్మకంగా మారింది. పోలీసులు, విద్యార్థుల మధ్య చెలరేగిన ఘర్షణలో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటన బిహార్ రాజధాని పాట్నాలో బుధవారం జరిగింది. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ పాట్నాలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్‌కు చెందిన అనుబంధ విద్యాసంస్థ ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.విద్యార్థులు స్థానిక గాంధీ మైదాన్ నుంచి రాజ్ భవన్ ముట్టడికి బయల్దేరారు. ఈ క్రమంలో గవర్నర్ నివాసానికి మూడు కిలోమీటర్ల దూరంలో విద్యార్థుల్ని పోలీసులు అడ్డుకున్నారు. గాంధీ మైదాన్ సమీపంలోని జేపీ గోలంబర్ వద్ద బారికెడ్లు పెట్టి విద్యార్థుల్ని ఆపేశారు. ర్యాలీ విరమించుకోవాలని విద్యార్థులకు పోలీసులు సూచించారు. అయినప్పటికీ వినిపించుకోని విద్యార్థులు రాజ్‌భవన్ ముట్టడికి బయల్దేరారు. ఈ క్రమంలో పోలీసులకు, విద్యార్థులకు ఘర్షణ చెలరేగింది. విద్యార్థుల్ని అడ్డుకోవడానికి పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. టియర్ గ్యాస్, వాటర్ కెనాన్లు ప్రయోగించారు. మరికొందరు విద్యార్థులు డాక్ బంగళా చౌరాహా వద్ద ఆందోళన చేశారు.సీజేపీ నిర్వహించిన నిరసనలకు సంబంధించి దిల్లీ పోలీసులు మొత్తం 10 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో నాలుగు, కానాట్ ప్లేస్‌లో మూడు, మందిర్ మార్గ్, బరాఖంబా రోడ్, కర్తవ్యపథ్ పోలీస్ స్టేషన్లలో ఒక్కో కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

# ఢిల్లీలో సీజేపీ నిరసన.. 16 మెట్రోస్టేషన్‌లు తాత్కాలికంగా మూసివేత..!




**ఢిల్లీ:** భద్రతా కారణాల దృష్ట్యా ఢిల్లీలోని 16 మెట్రో స్టేషన్ల ను తాత్కాలికంగా మూసివేశారు. బుధవారం ఉదయం ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించింది. కీలక మర్గాలైన రాజీవ్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్, మండీ హౌస్, ఐటీవో, ఖాన్ మార్కెట్‌తోపాటు లోక్ కల్యాణ్ మార్గ్, పటేల్ చౌక్, రామకృష్ణ ఆశ్రమ్ మార్గ్, బరాఖంబా రోడ్, సుప్రీంకోర్టు, సేవా తీర్థ్, జన్‌పథ్, ఢిల్లీ గేట్, ఇంద్రప్రస్థ, జోర్ బాగ్, శివాజీ స్టేడియం స్టేషన్లను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మూసివేయనున్నట్లు తెలిపింది.అయితే రాజీవ్ చౌక్, మండీ హౌస్, సెంట్రల్ సెక్రటేరియట్ స్టేషన్లలో ఇంటర్‌ఛేంజ్ సౌకర్యం మాత్రం కొనసాగుతుందని స్పష్టంచేసింది. ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (జబ్రీ) నిరసనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జూలై 20న పార్లమెంట్ మార్చ్ సమయంలోనూ పలు మెట్రో స్టేషన్లను మూసివేశారు. మెట్రో నడవకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# నీట్‌పై చర్చకు విపక్షాలు పట్టు- ప్రభుత్వం నిరాకరించడం వల్లే రాజ్యసభలో ప్రతిష్టంభనన్న జైరాం రమేశ



**దిల్లీ:** నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ వివాదం, నిర సనకారులపై పోలీసుల చర్య, ప్రతిపక్ష నాయకుల నిర్బంధం పార్లమెంట్?లో మరోసారి తీవ్ర దుమారం రేపింది. ఈ అంశాలపై రాజ్యసభలో రూల్ 267 కింద అన్ని కార్యక్రమాలను నిలిపివేసి తక్షణ చర్చ చేపట్టాలని విపక్షాలు పట్టుబట్టాయి. అయితే ప్రభుత్వం అందుకు అంగీకరించకపోవడంతో సభలో ప్రతిష్టంభన కొనసాగుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్ ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.రాజ్యసభలో ప్రతిపక్ష నేత నేతృత్వంలో పలువురు విపక్ష పార్టీల సభ్యులు రూల్ 267 కింద నోటీసు సమర్పించినట్లు జైరాం రమేశ్ తెలిపారు. జులై 20న విద్యార్థుల శాంతియుత నిరసనల సందర్భంగా పోలీసులు అధిక బలప్రయోగానికి పాల్పడ్డారనే ఆరోపణలపై చర్చ జరపాలని వారు కోరినట్లు చెప్పారు. నీట్ అంశంపై రూల్ 267 కింద చర్చ నిర్వహించేందుకు ప్రభుత్వం నిరాకరించడమే రాజ్యసభలో ప్రతిష్టంభనకు ప్రధాన కారణమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి ఈ అంశంపై మౌనం వీడాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌పై కూడా చర్చ జరగాలని విపక్షం కోరు తోందన్నారు.అయితే రాజ్యసభలో రూల్ 267 ప్రకారం సభలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలను నిలిపివేసి అత్యవసర ప్రజా ప్రయోజన అంశంపై వెంటనే చర్చ చేపట్టే అవకాశం ఉంటుంది. అయితే రూల్ 176 కింద స్వల్పకాలిక చర్చ మాత్రమే నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో రూల్ 267 కిందే చర్చ జరగాలని విపక్షం పట్టుబడుతుండగా, ప్రభు త్వం మాత్రం సభా నిబంధనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని చెబుతోంది. లాఠీచార్జ్, టియర్ గ్యాస్, పెల్లెట్ గన్స్, షాక్ బ్యాటన్లు, వాటర్ క్యానన్ల వినియోగంపై సభలో సమగ్ర చర్చ జరగాలని విపక్షం డిమాండ్ చేసింది. అలాగే జులై 21న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర విపక్ష నేతలను అదుపులోకి తీసుకున్న ఘటనపైనా వివరణ కోరింది.కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ నీట్-సీబీఎస్ఈ పరీక్షల లీకేజీ అంశంపై వాయిదా తీర్మానం ద్వారా చర్చ జరగాలని అన్ని విపక్ష పార్టీలు ఏకగ్రీవంగా నిర్ణయించాయని భవిష్యత్తులో ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేం తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పాటు భవిష్యత్తులో ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు సమగ్ర కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం చర్చకు దూరంగా పారిపోతోందని విమర్శించారు. సభ పదేపదే వాయిదా పడుతోందని, రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనలకు పార్టీ పూర్తి మద్దతు ఇచ్చిందని చెప్పారు.

# స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్‌కు కట్టుబడి ఉన్నాం




**దిల్లీ:** ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని స్వేచ్ఛగా ఉంచడానికి కట్టుబడి ఉన్నామని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్? స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్‌రాజధాని మనీలాలో జరిగిన క్వాడ్ కూటమి సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో జైశంకర్‌తోపాటు అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ విదేశాంగ మంత్రులు మార్కో రూబియో, పెన్నీ వాంగ్, తోషిమిట్సు మొటెగి పాల్గొన్నారు. ఈ క్వాడ్ విదేశాంగ మంత్రులు ఇంతకుముందు మే చివరి వారంలో దిల్లీలో సమావేశం అయ్యారు. ఆ సమయంలో మార్కో రూబియో భారత పర్యటనకు వచ్చారు."మనీలా లో జరిగిన క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఇండో-పసిఫిక్ ప్రాంత పరిస్థితులను సమీక్షించాము. ఇటీవల జరిగిన పరిణామాలపై చర్చించాం. దిల్లీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మేం అనుసరించాం. ఆసియాన్ ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ, స్వేచ్ఛా, సమ్మిళిత ఇండో- పసిఫిక్ ప్రాంతానికి మేము కట్టుబడి ఉన్నాం" అని జైశంకర్ ఎక్స్ వేదికగా తెలిపారు.మోస్ట్ పవర్‌ఫుల్‌అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏసియన్ నేషన్ (ఆసియాన్) అనేది ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అత్యంత ప్రభావవంతమైన కూటముల్లో ఒకటిగా ఉంది. ఇందులో భారత్, అమెరికా, చైనా, జపాన్, ఆస్ట్రేలియా సహా పలుదేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. కాగా, మనీలా జరిగిన క్వాడ్ విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా వారంతా ఒక ఉమ్మడి ప్రకటన చేశారు. స్వేచ్ఛా, సమ్మిళిత ఇండో-పసిఫిక్? ప్రాంతాన్ని బలోపేతం చేసేందుకు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఆసియాన్ ఐక్యత, ప్రాధాన్యాలకు పూర్తి మద్దతును ఇవ్వడానికే తాము సమావేశమయినట్లు తెలిపారు.ఈ ప్రాంతంలో చైనా సైనిక ప్రాబల్యం, చర్యలు పెరుగుతున్న నేపథ్యంలో, శాంతి, స్థిరత్వాన్ని నిర్ధరించడానికి విస్తృత సహకారం అందించాలని క్వాడ్ దేశాలు సంకల్పించాయి. తాము ఈ ప్రాంతం స్వేచ్ఛ కోసం, ఆసియాన్ దేశాలతో కలిసి పనిచేయడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నామని ప్రకటిం చాయి. ఈ సమావేశంలో ప్రాంతీయ సవాళ్లు, అవకాశాల గురించి క్వాడ్ మంత్రులు చర్చించారు. వారి ప్రకటన ప్రకారం, సముద్ర, అంతర్జాతీయ భద్రత, ఆర్థిక శ్రేయస్సు, రక్షణ, కీలకమైన సాంకేతికతలు, మానవతా సాయం, అత్యవసర స్పందన లాంటి ఉమ్మడి ప్రాధాన్యతలపై ప్రధానంగా దృష్టి పెట్టారు. ఇండో-పసిఫిక్ సముద్ర పరిధిలో శాంతి, స్థిరత్వం అనేవి ఈ ప్రాంత భద్రత, శ్రేయస్సుకు పునాది అని మేము బలంగా నమ్ముతున్నాము" క్వాడ్ విదేశాంగ మంత్రులు ఉమ్మడి ప్రకటన చేశారు.ం రూబియోతో జైశంకర్ భేటీఈ సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ బుధవారం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో భేటీ అయ్యారు. భారత్-అమెరికా సమగ్ర ప్రపంచవ వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన కీలక రంగాలపై వీరిద్దరూ చర్చలు జరిపారు. "మనీలాలో రూబియోను కలవడం సంతోషంగా ఉంది. భారత్-అమెరికా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన రంగాలైన వాణిజ్యం, సుంకాలు, ఇంధనం, రక్షణ, భద్రత, కీలక ఖనిజాలు, ఏఐ లాంటి అంశాలపై మా సమావేశంలో ప్రధానంగా చర్చించాం. పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, ప్రపంచ, బహుపాక్షిక పరిణా మాలపై అభిప్రా యాలను పంచుకున్నాం" అని జైశంకర్? ఎక్స్ వేదికగా తెలిపారు. అంతకు ముందు జైశంకర్ ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి సెనేటర్? పెన్నీ వాంగ్, ఫిలిప్పీన్స్ విదేశాంగ కార్యదర్శి మా.థెరిసా పి.లాజారోలతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేయడంపై చర్చలు జరిపారు.

# ఉగ్రవాదుల కాల్పుల్లో జవాన్ మృతి.. మరొకరికి గాయాలు.



**జమ్మూ:** కాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఒక జవాన్ మరణించగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్-కోకెర్‌నాగ్ రోడ్డు మార్గంలో జరిగింది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్ఓజీ)కు చెందిన ఇద్దరు జవాన్లు బుధవారం ఉదయం అనంత్‌నాగ్-కోకెర్‌నాగ్ రోడ్డులో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన తీవ్రవాదులు ఈ జవాన్లపై కాల్పులు జరిపారు.ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన ఇతర భద్రతా సిబ్బంది వెంటనే వారిని చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆ ఇద్దరిలో తీవ్ర గాయాల కారణంగా ఒక జవాన్ అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. మరణించిన జవాన్‌ను ఆషిక్ హుస్సేన్‌గా గుర్తించారు. మరో జవాన్ ఆరోగ్య పరిస్తితిపై ఇంకా ఎలాంటి సమాచారం లేదు. ప్రస్తుతానికి అతడికి చికిత్స కొనసాగుతోంది. ఉగ్రవాదుల కాల్పుల నేపథ్యంలో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఈ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నాయి. ఈ ప్రాంతం అంతా గాలింపు, తనిఖీలు చేపట్టారు. ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా పట్టుకోవాలని, పారిపోకుండా చూడాలని గట్టి భద్రత ఏర్పాటు చేశారు. మొత్తం అన్ని ప్రాంతాల్ని తమ అధీనంలోకి తీసుకున్నారు.ఈ కాల్పుల ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మరోవైపు రాజౌరి సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్న ఒక జవాన్ ప్రమాదవశాత్తు ఎత్తైన ప్రదేశం నుంచి కిందపడి మరణించాడు. మృతుడిని సుఖ్‌ప్రీత్ సింగ్ (27)గా గుర్తించారు. అతడు సుందర్‌బని సెక్టార్‌లోని మహదేవ్ పోస్టు వద్ద ఎత్తైన ప్రదేశంలో డ్యూటీ చేస్తున్నాడు. అయితే, అక్కడ పట్టు కోల్పోయి జారిపోవడం వల్ల కింద పడి ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. అతడి న్ని స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# భారీ వరదలతో అఫ్గానిస్తాన్ అతలాకుతలం



**అఫ్గానిస్తాన్ :** తూర్పు అఫ్గానిస్తాన్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సంభవించిన వరదల వల్ల సుమారు 20 మంది మరణించారని, మేయర్‌తో సహా 100 మంది గల్లంతయ్యారని అఫ్గానిస్తాన్ జాతీయ విపత్తు నిర్వహణ కమిటీకి చెందిన యూసఫ్ హమ్మద్ ప్రకటించారు. ఆ దేశంలోని నూరిస్తాన్ ప్రావిన్స్ రాజధాని పరున్ నగరం ఈ వరదల వల్ల తీవ్రంగా దెబ్బతిన్నది. వరదల్లో గల్లంతైన వారిలో ఈ పరున్ నగర మేయర్ కూడా ఉన్నారు. అలాగే 80 మందికి పైగా గాయపడ్డారు. ఇంకా భారీ ఆర్థిక, ప్రాణ నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇళ్లు, దుకాణాలు, మున్సిపల్ భవనాలు ధ్వంసమయ్యాయి.తుఫానులు, కరవులతో సహా ప్రకృతి విపత్తులు, వాతావరణ మార్పుల ప్రభావానికి తీవ్రంగా గురయ్యే దేశాల్లో అఫ్గానిస్తాన్ ఒకటి. అలాగే ప్రపంచంలోని అత్యంత పేద దేశాల్లో కూడా ఒకటి. ఇప్పుడీ వరదలకు పరున్ మున్సిపాలిటీ పూర్తిగా ధ్వంసమైందని అక్కడి ఓ ఎన్‌జీవో ష్ఫాల్‌కు నాయకత్వం వహిస్తున్న అషిఖుల్లా సఫి వార్తా సంస్థలకు వెల్లడించారు. సహాయక చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.అఫ్గానిస్తాన్‌లో ఈ బుధవారం వరకు భారీ వర్షాలు, వరదలు కొనసాగుతాయని ఆ దేశ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీనివల్ల ఆ దేశంలోని 10 ప్రావిన్స్‌లు ఈ వరదలకు గురయ్యే అవకాశం ఉందని, ఆ ప్రాంతాలకు దూరంగా ఉండాలని ప్రజలకు అధికారులు సూచించారు.

# జులై 20 నిరసనలు ట్రైలర్ మాత్రమే- డిమాండ్లు అంగీకరించకపోతే దిల్లీకి లక్షలాది యువత:



**దిల్లీ:** దేశవ్యాప్తంగా కొనసాగుతున్న తమ ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే మరింత భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) హెచ్చరించింది. జులై 20న నిర్వహించిన నిరసన కేవలం ట్రైలర్ మాత్రమేనని, అవసరమైతే లక్షలాది మంది యువత దిల్లీకి తరలివస్తారని పార్టీ ప్రతినిధి అశుతోష్ రాంకా తెలిపారు. ఇదే సమయంలో దిల్లీలో జరిగిన ఆందోళనల నేపథ్యంలో పోలీసులు మొత్తం 10 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మరోవైపు నిరసనల నేపథ్యంలో అదనపు భద్రతా బలగాలను మోహరించారు. ఇదిలా ఉండగా భద్రతా కారణాల దృష్ట్యా, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు జన్‌పథ్, రాజీవ్ చౌక్, పటేల్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్లను మూసివేశారు.'పోలీసుల చర్యలతోనే నిరసనలు ఉద్రిక్తత'తమ ఉద్యమాన్ని స్వాతంత్ర్యం తర్వాత దేశంలో జరిగిన అతిపెద్ద ప్రజా ఉద్యమంగా అశుతోష్ రాంకా అభివర్ణించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే ఈసారి మరింత భారీ స్థాయిలో నిరసనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. యువత ఆవేదనను కేంద్రం నిర్లక్ష్యం చేస్తే తీవ్ర రాజకీయ పరిణామాలు ఎదు రయ్యే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. తమ ఆందోళనలు పూర్తిగా శాంతియుతంగానే సాగుతున్నా యని స్పష్టం చేశారు. జులై 20న నిర్వహించిన ర్యాలీ కూడా ప్రశాంతంగానే కొనసాగిందని, అయితే విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడంతోనే ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు. గత 31 రోజులుగా గాంధీ, అంబేడ్కర్ సిద్ధాంతాలను అనుసరిస్తూ శాంతియుత నిరసన కొనసాగిస్తున్నామని చెప్పారు. ఆందోళనకారులపై ఎఫ్ఐఆర్‌లు వద్దన్న సీజేపీనిరసనల్లో పాల్గొన్న వారిపై ఇప్పటికే నమోదైన కేసులతో పాటు భవిష్యత్తులో కూడా ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని ప్రభుత్వం హామీ ఇవ్వాలని సీజేపీ డిమాండ్ చేసింది. అలాంటి హామీ వచ్చే వరకు ఉద్యమాన్ని విరమించబోమని అశుతోష్ స్పష్టం చేశారు. తమ నాయకత్వం కేసులకు భయపడదని, అవసరమైతే అరెస్టులను కూడా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ ఉద్యమం రాజకీయాలకు అతీతమని అన్నారు. ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా, బీజేపీ నాయకులు కూడా ముందుకు వచ్చి యువత డిమాండ్లకు మద్దతు తెలపాలని కోరారు. ప్రజలకు సంబంధించిన అంశంపై అందరూ ఏకమవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# తిరిగి జట్టులోకి వచ్చిన కమిన్స్, హేజిల్‌వుడ్, లైయాన్

## • బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్టు ప్రకటన



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆస్ట్రేలియా.. వరుసగా మూడోసారి డబ్ల్యూటీసీ ఫైనల్ చేరేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్ కోసం బలమైన జట్టును బరిలోకి దింపుతోంది. వచ్చే నెలలో జరగనున్న ఈ మ్యాచ్‌లకు సంబంధించి క్రికెట్ ఆస్ట్రేలియా తాజాగా జట్టును ప్రకటించింది. ప్యాట్ కమిన్స్ సారథ్యంలో 13 మంది ఆటగాళ్లను ఎంపిక చేసింది. గాయం నుంచి కోలుకున్న జోష్ హేజిల్‌వుడ్, స్పిన్నర్ నాథన్ లైయాన్ తిరిగి జట్టులోకి వచ్చారు. ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ 2025-27లో భాగంగా స్వదేశంలో బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌తో ఆ జట్టు సీనియర్లు పునరాగమనం చేయనున్నారు. గాయాల కారణంగా సుదీర్ఘ ఫార్మాట్‌కు దూరమైన ప్యాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, నాథన్ లైయాన్ బంగ్లా సిరీస్‌తో ఎంట్రీ ఇవ్వనున్నారు. ప్రస్తుతానికి 13 మందితో స్క్వాడ్‌ను ఎంపిక చేశామని, అవసరాన్ని బట్టి మార్పులు చేస్తామని, అందుకోసం తమ వద్ద చాలా ఆప్షన్లు ఉన్నాయని చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిలీ పేర్కొన్నాడు.ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో ఆస్ట్రేలియా, ఎనిమిది మ్యాచ్‌లలో ఏడు విజయాలు, ఒక ఓటమితో, 87.50 విజయ శాతంతో పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో ఉంది. బంగ్లాదేశ్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసి.. అగ్రపీఠాన్ని మరింత పదిలం చేసుకోవాలని ఆ జట్టు భావిస్తోంది. ఆస్ట్రేలియా వచ్చే 8 నెలల వ్యవధిలో 14 టెస్టులు ఆడనుంది. ఇందులో భారత్ వేదికగా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కూడా జరగనుంది. మరోవైపు బంగ్లాదేశ్ జట్టు 18 ఏళ్ల తర్వాత టెస్టులు ఆడేందుకు ఆస్ట్రేలియాకు వెళ్తోంది. ఆగస్టు 13 నుంచి ఆగస్టు 26 వరకు ఇరుజట్ల మధ్య రెండు టెస్టుల సిరీస్ జరుగనుంది.బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ కోసం ఆస్ట్రేలియా జట్టు: ప్యాట్‌పాట్ కమిన్స్ (కెప్టెన్), స్కాట్ బోలాండ్, అలెక్స్ కేరీ, కామెరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లాబుషేన్, నాథన్ లియాన్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, జేక్ వెదరాల్డ్, బ్యూ వెబ్‌స్టర్

# కేఎల్ రాహుల్ బ్యాటింగ్ ఆర్డర్ మార్పుపై విమర్శలు

## • టీమిండియాపై మాజీ కెప్టెన్ క్రిస్ శ్రీకాంత్ ఆగ్రహం



లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో కేఎల్ రాహుల్‌ను నంబర్ 6 స్థానంలో బ్యాటింగ్‌కు పంపడంపై భారత మాజీ కెప్టెన్ క్రిస్ శ్రీకాంత్ అసహనం వ్యక్తం చేశారు. ఈ మ్యాచ్‌లో 388 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 27 పరుగుల తేడాతో ఓడిపోయింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-2తో కోల్పోయింది. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన ఆయన.. రాహుల్ బ్యాటింగ్ స్థానాన్ని మార్చడంపై ప్రశ్నలు లేవనెత్తారు. “అంత భారీ లక్ష్యాన్ని ఛేదించేటప్పుడు ఎవరైనా కేఎల్ రాహుల్‌ను నంబర్ 6 స్థానంలో పంపుతారా? క్లిష్టమైన పరిస్థితుల్లో లక్ష్య ఛేదనలో అతడు జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు కదా. రాహుల్ నంబర్ 6 లేదా 7 స్థానంలో బ్యాటింగ్ చేసే ఆటగాడా? ఇది చాలా అన్యాయం. అతడి బాడీ లాంగ్వేజ్ కూడా ఏదో ఆందోళనలో ఉన్నట్లుగా అనిపించింది” అని క్రిస్ శ్రీకాంత్ పేర్కొన్నారు. సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీల విషయంలో ఎలాగైతే తప్పులు చేశారో ఇప్పుడు కేఎల్ రాహుల్ విషయంలోనూ అలాగే చేస్తున్నారు. ఒకవేళ లార్డ్స్ వన్డేలో కేఎల్ రాహుల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఉంటే 2023 ప్రపంచకప్ మాదిరిగా విరాట్ కోహ్లీకి తోడుగా నిలిచేవాడు. రాహుల్ వేగంగా పరుగులు రాబడతాడు. కానీ, మ్యాచ్ దాదాపు ముగిసిపోయిన తర్వాత అతడిని బ్యాటింగ్‌కు పంపారు. ఓవర్‌కు 15 పరుగులు అవసరమైనప్పుడు అక్షర్ పటేల్‌తో కలిసి రాహుల్ మ్యాచ్‌ను గెలిపిస్తాడా?” అని శ్రీకాంత్ ప్రశ్నించారు. కాగా భారత్ స్కోరు 304/4 వద్ద ఉన్నప్పుడు రాహుల్ బ్యాటింగ్‌కు వచ్చాడు. అప్పటికి ఓవర్‌కు దాదాపు 15 పరుగులు అవసరమయ్యాయి. ఈ సమయంలో జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో రాహుల్ ఔట్ అయ్యాడు. 12 బంతుల్లో 8 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. ఈ వన్డే సిరీస్‌లో రాహుల్ కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడారు. తొలి వన్డేలో ఒక పరుగు చేసిన అతడు, లార్డ్స్‌లో జరిగిన సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో 12 పరుగులు చేశారు. గాయం కారణంగా రెండో వన్డేకు దూరమయ్యాడు.

# యూకే పిచ్‌లు సవాల్ విసురుతాయి

## అందుకే అక్కడ మేం ఓడిపోయాం

## భారత యువ క్రికెటర్ తిలక్ వర్మ



భారత క్రికెట్ జట్టులో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని, ప్రస్తుతం జింబాబ్వే పర్యటనలో వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తెలుగు కుర్రాడు తిలక్ వర్మ విదేశీ పర్యటనలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు అభిమానుల నుంచి భారీ అంచనాలు ఉంటాయని చెప్పాడు. ఇదే సమయంలో జట్టు యాజమాన్యం నుంచి బాధ్యతలు ఉంటాయని తెలిపాడు. ఇటీవల ముగిసిన ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలలో వాతావరణం, పిచ్ పరిస్థితులు ఎంతో భిన్నంగా ఉన్నాయని తిలక్ అభిప్రాయపడ్డాడు. కాగా గత రెండేళ్లలో అంటే టీ20 ప్రపంచకప్ 2024 జరిగిన తర్వాత, భారత జట్టు ఆడిన మ్యాచ్‌లలో మెజారిటీ ఆసియా ఖండంలోనే జరిగాయి. ఈ పరిస్థితుల్లో స్వదేశీ పిచ్‌లతో పాటు ఉపఖండంలోని అనుకూలమైన మైదానాల్లో ఎక్కువగా ఆడిన తర్వాత, నేరుగా విదేశీ పరిస్థితులకు మారి అక్కడ ఆడటం సవాల్‌తో కూడుకున్న విషయమని తిలక్ వర్మ అన్నాడు. ముఖ్యంగా ఇంగ్లాండ్, ఐర్లాండ్ వంటి దేశాల్లో బంతి అనూహ్యంగా స్వింగ్ అవ్వడం, సీమ్ కావడం వల్ల బ్యాటర్లు తమ శైలిని మార్చుకోవాల్సి వస్తుందని అతడు వెల్లడించాడు. ఇదే సమయంలో ఇంగ్లాండ్ జట్టును తిలక్ వర్మ ప్రశంసించాడు. టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్స్ వరకు వెళ్లిన ఇంగ్లాండ్ ఎంత అత్యుత్తమమైన జట్టో అందరం చూశామని అతడు గుర్తు చేశాడు. అంతటి పటిష్టమైన జట్టును, వారి సొంత గడ్డపై ఎదుర్కోవడం సవాల్ విసురుతుందని వివరించాడు. విదేశీ వేదికలపై అగ్రశ్రేణి జట్లతో ఆడేటప్పుడు దక్కే అనుభవం యువ ఆటగాళ్లకు భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని.. సవాళ్లను ఎదుర్కొనే మానసిక దృఢత్వాన్ని పెంచుతుందని పేర్కొన్నాడు. ప్రస్తుతం జింబాబ్వే పర్యటనలో ఉన్న భారత యువ జట్టుకు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఈ పర్యటన ద్వారా మళ్లీ పాత ఫామ్‌ను అందుకోవాలని చూస్తున్నాడు. విదేశీ పర్యటనలలో ఎదురైన ఓటములు, కష్టమైన పరిస్థితుల నుంచి పాఠాలు నేర్చుకుని.. మెరుగ్గా రాణిస్తామని ధీమా వ్యక్తం చేశాడు. ఐర్లాండ్ చేతిలో 0-2, ఇంగ్లాండ్ చేతిలో 0-4 తేడాతో భారత్.. టీ20 సిరీస్‌లలో



# వైభవ్ ఆటగాడిని చూడలేదు

## • సూర్యవంశీపై హర్భజన్ సింగ్ ప్రశంసల జల్లు

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ప్రశంసల జల్లు కురిపించాడు. వైభవ్ లాంటి ఆటగాడిని తాను ఇప్పటివరకు చూడలేదని కొనియాడాడు. వైభవ్ అత్యంత ప్రతిభావంతమైన ఆటగాడని, గతంలో ఏ ఆటగాడు సాధించని ఘనతను అందుకుంటున్నాడని కితాబిచ్చాడు.ఇంగ్లండ్ పర్యటనలో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ మరో కీలక పోరుకు సిద్ధమయ్యాడు. ఇంగ్లండ్‌తో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైన వైభవ్.. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌లో బరిలోకి దిగనున్నాడు. గురువారం హరారే వేదికగా జరిగే మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్ నేపథ్యంలో జియోస్టార్ షోలో మాట్లాడిన హర్భజన్ సింగ్.. వైభవ్ సూర్యవంశీ ఫియర్‌లెస్ బ్యాటింగ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ ఆడుతున్నట్లు గతంలో ఎవరూ ఆడలేదు. అతను అసాధారణ నైపుణ్యం కలిగిన ప్లేయర్. ఇలాంటి ఆటగాడిని నేను ఇప్పటి వరకు చూడలేదు. ఒకప్పటి యువతకు.. ఇప్పటి కుర్రాళ్లకు మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం మీడియా, సోషల్ మీడియా. అప్పట్లో కూడా ఇలాంటి ఆటగాళ్లు ఉన్నారేమో. కానీ ఈ రోజుల్లో సోషల్ మీడియా ద్వారా ఎక్కువగా వెలుగులోకి వస్తున్నారు.ఫియర్‌లెస్ మనస్తత్వం, తమకు నచ్చే విధంగా ఆడే ఆటగాళ్లను జనాలు అంగీకరించడమే ఆటలో వచ్చిన అతి పెద్ద మార్పు.'అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు.వైభవ్ ఐపీఎల్ అరంగేట్రానికి ముందు జరిగిన ఓ సంఘటనను కూడా హర్భజన్ సింగ్ ఈ సందర్భంగా గుర్తు చేశాడు. 'రాజస్థాన్ రాయల్స్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ ఉన్న సమయంలో వైభవ్ సూర్యవంశీని తొలి బంతిని ఎలా ఆడుతావు? అని అడిగాడు. దానికి వైభవ్.. అది నా జోన్‌లో ఉంటే సిక్స్ బాదుతానని బదులిచ్చాడు. అన్నట్లుగానే శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో తొలి బంతినే సిక్స్ బాది తన ఐపీఎల్ కెరీర్‌ను ఘనంగా ప్రారంభించాడు. ఇది వైభవ్ ఫియర్‌లెస్ మనస్తత్వాన్ని తెలియజేస్తోంది'అని తెలిపాడు. తన కెరీర్‌లో సచిన్ టెండూల్కర్ ఇచ్చిన సలహాను ఎప్పటికీ మర్చిపోనని హర్భజన్ సింగ్ గుర్తు చేసుకున్నాడు. 'క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ నాకు ఇచ్చిన సలహాను నేను ఎప్పటికీ మర్చిపోను.'నీ క్రికెట్ ప్రయాణంలో ఎన్నో ఆటంకాలు ఎదురవుతాయి. ఎన్నో విషయాలు నీ దారిలోకి వస్తాయి. కానీ ఎటువైపు నీ మనసును మళ్లించకుండా ఆటపై మాత్రమే దృష్టిని పెట్టాలి. ఇలా కొనసాగితేనే ఈ ప్రపంచంలో నిన్ను ఎవరూ ఆపలేరు. నువ్వు ఏది అవ్వాలనుకున్నా.. ఏది చేయాలనుకున్నా.. నువ్వు సరైన మార్గంలో నడిస్తేనే.. అన్ని రకాల గౌరవం, కీర్తిని పొందుతావు.'అని సచిన్ పాజీ నాకు చెప్పాడు.'అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. ఇదే సలహాను వైభవ్ సూర్యవంశీతో పాటు ఈ తరం యువ ఆటగాళ్లకు ఇవ్వాలనుకుంటున్నాను. 'ఆటపైనే ఫోకస్ పెట్టాలి. ఆట కంటే మనం పెద్ద కాదనే విషయాన్ని గ్రహించాలి. ఈ ఆట వల్లే మనం ఈ స్థాయికి వచ్చామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. నీ వైఖరి సరిగ్గా లేకపోతే.. ఈ ఆట ఏంత ఇచ్చిందో అంతే వేగంగా వెనక్కి తీసుకుంటుంది.'అని హర్భజన్ సింగ్ హెచ్చరించాడు.

# నేటి నుంచి కామన్‌వెల్త్ క్రీడలు

## • 11 రోజులు, 10 క్రీడాంశాలు, 215 మెడల్ ఈవెంట్స్



**గ్లాస్గో (స్కాట్లాండ్) :** స్కాట్లాండ్‌లోని పోర్ట్‌నగరం కామన్‌వెల్త్ క్రీడలకు స్పోర్ట్స్ క్యాపిటల్‌గా మారింది!. 2014లో కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చిన గ్లాస్గో నగరం.. 2026 క్రీడల ఆతిథ్యం నుంచి ఆస్ట్రేలియా తప్పుకోవటం మరోసారి నిర్వహణ బాధ్యతలను తీసుకుంది. ఆర్థిక సవాళ్లు, నిర్వహణ వ్యయ భారం కామన్‌వెల్త్ క్రీడలను కళ తప్పేలా చేశాయి. 11 రోజులు, 10 క్రీడాంశాలు, 215 మెడల్ ఈవెంట్లతో నేటి నుంచి కామన్‌వెల్త్ క్రీడలు ఆరంభం కానున్నాయి. బ్రిటీష్ పాలిత దేశాలు పోటీపడే ఈ క్రీడల్లో ఈసారి 74 దేశాల నుంచి సుమారు 3 వేల మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. నేటి ఆరంభ వేడుకలతో పోటీలు ప్రారంభం కానుండగా.. ఆగస్టు 2న ముగింపు వేడుకలతో క్రీడలు ముగియనున్నాయి. 2022లో బర్మింగ్‌హామ్ కామన్‌వెల్త్ క్రీడల్లో 20 క్రీడాంశాలు ఉండగా.. తాజాగా గ్లాస్గోలో వాటిని 10కు కుదించారు. బాస్కెట్‌బాల్, ఆర్టిస్టిక్స్ జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, బౌల్స్, బాక్సింగ్, జూడో, నెట్‌బాల్, స్విమ్మింగ్, ట్రాక్ సైక్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లో 74 దేశాల క్రీడాకారులు పోటీపడనున్నారు. పారా విభాగంలో ఆరు క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి. తొలి రోజు పోటీల్లో బౌల్స్, పారా బౌల్స్ ఈవెంట్లు జరుగనున్నాయి. గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడలకు భారత్ 125 మందితో కూడిన బలమైన జట్టును పంపిస్తోంది. ఒలింపిక్ పతక విజేతలు నీరజ్ చోప్రా, మీరాబాయి చాను వంటి మేటి అథ్లెట్లు గ్లాస్గోలో బరిలోకి దిగుతున్నారు.




# సింధు, సేన్ ముందంజ

**చాంగ్జౌ :** జపాన్ ఓపెన్ టైటిల్ గెలిచిన జోష్‌లో ఉన్న స్టార్ షట్లర్ పీవీ సింధు.. చైనా ఓపెన్‌నూ విజయంతో ఆరంభించింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు.. 21-14, 9-21, 21-10తో భారత్‌కే చెందిన యువ షట్లర్ ఉన్నతి హుడాను ఓడించి ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది.పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్.. 22-20, 15-21, 21-14తో యుశి టనాక (జపాన్)ను చిత్తుచేశాడు. మరో పోరులో భారత యువ సంచలనం ఆయుష్ శెట్టి.. 21-17, 5-21, 21-17తో ప్రపంచ 11వ ర్యాంకర్ అల్వి ఫర్హాన్ (ఇండోనేషియా)కు షాకిచ్చాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధృవ్ కపిల-తనీషా క్రాస్టో జంటతో పాటు మెన్స్ డబుల్స్‌లో అర్జున్-హరిహరన్ జోడీ తొలి రౌండ్‌కే ఇంటిబాట పట్టింది.






# ఇంటర్‌లోనే లవ్‌లో పడ్డ రాజమౌళి



స్టార్ డైరెక్టర్‌గా ఉన్నత శిఖరాలకి ఎదిగిన రాజమౌళి కూడా ఒకప్పుడు సాధారణ విద్యార్థే. అయితే ఆయన గతంలో చెప్పిన తన తొలి ప్రేమ జ్ఞాపకాలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక పాత ఇంటర్వ్యూలో రాజమౌళి తన ఇంటర్ రోజుల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో తన క్లాస్‌లో ఉన్న ఓ అమ్మాయిని ఎంతో ఇష్టపడినట్లు ఆయన వెల్లడించారు. అయితే ఆమెపై ఉన్న అభిమానాన్ని లేదా ప్రేమను నేరుగా చెప్పే ధైర్యం మాత్రం తనకు ఎప్పుడూ రాలేదని చెప్పారు. తనకు ఆ అమ్మాయి అంటే ఇష్టమని క్లాస్‌లోని దాదాపు అందరికీ తెలుసని, స్నేహితులు కూడా ఆ విషయంపై తనను ఆటపట్టించేవారని గుర్తుచేసుకున్నారు. అయినప్పటికీ ఏడాది మొత్తం గడిచిపోయే వరకు ఆమెతో మాట్లాడే అవకాశం రాలేదని తెలిపారు. చివరికి విద్యా సంవత్సరం ముగిసే సమయానికి ఒక్కసారి ధైర్యం చేసి ఆమెతో మాట్లాడానని చెప్పారు. తన ముందు కూర్చున్న ఆ అమ్మాయిని పేరు పెట్టి పిలుస్తూ 'ట్యూషన్ ఫీజు కట్టావా?' అని మాత్రమే అడిగానని తెలిపారు. ఆమె ఒక్కసారిగా వెనక్కి తిరిగి తన వైపు చూసిన ఆ క్షణం ఇప్పటికీ తన మదిలో నిలిచిపోయిందని, ఆ ఒక్క చూపు కోసం చాలా రోజులుగా ఎదురుచూశానని రాజమౌళి భావోద్వేగంగా చెప్పుకొచ్చారు. ఆ సంఘటన జరిగినప్పుడు రాజమౌళి ఏలూరులో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారని తెలుస్తోంది. అనంతరం కొంతకాలం చదువుకు విరామం ఇచ్చిన ఆయన, తర్వాత ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేశారు. ఆ తర్వాత సినీ రంగంలో అడుగుపెట్టి రచయితగా, దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. సినీ పరిశ్రమలో స్థిరపడిన తర్వాత తమ కుటుంబానికి సన్నిహితంగా ఉన్న కుటుంబానికి చెందిన ఫ్యాషన్ డిజైనర్ రమను ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి రమ ఆయన వ్యక్తిగత జీవితంలోనే కాకుండా వృత్తిపరమైన ప్రయాణంలోనూ ఎంతో సపోర్ట్‌గా నిలుస్తున్నారు.




# రంభ ఊర్వశి మేనక నుంచి సాంగ్ విడుదల

అల్లరి నరేశ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'రంభ ఊర్వశీ మేనక'. చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో సురభి కథానాయికగా కనిపించనున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమాలోని 'నా కంటి మీద కునుకే'అంటూ సాగే పాటను విడుదల చేశారు. భాస్కరభట్ల రవికుమార్ లిరిక్స్ అందించిన ఈ పాటను ధనుంజయ్ ఆలపించారు.

# స్పిరిట్ 40శాతం షూటింగ్ పూర్తి

## కీలక అప్‌డేట్ ఇచ్చిన సందీప్ వంగా




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం స్పిరిట్ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచి ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజాగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షూటింగ్ పురోగతిపై కీలక సమాచారం వెల్లడించారు. అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా, అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'స్పిరిట్' అప్డేట్‌ను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా పాల్గొన్నారు. వేదికపై మాట్లాడిన సందీప్ రెడ్డి వంగా, 'స్పిరిట్' చిత్రీకరణ ఇప్పటికే 40 శాతం పూర్తయిందని వెల్లడించారు. అంతేకాదు, ఈ సినిమా ప్రతి ప్రేక్షకుడికి నచ్చేలా రూపొందిస్తున్నామని, ప్రభాస్ అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సందీప్ చేసిన ఈ ప్రకటనతో ప్రభాస్ అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా షూటింగ్ వేగంగా సాగుతుండటంతో విడుదలపై కూడా త్వరలో మరిన్ని అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో ప్రభాస్ ఓ పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నట్లు సమాచారం. అకాడమీ టాపర్‌గా ఎదిగిన ఓ పోలీస్ అధికారి జీవితంలో జరిగే అనూహ్య పరిణామాలు, అతనిపై వచ్చిన ఆరోపణలు, వాటి వెనుక ఉన్న అసలు నిజం కథలో కీలకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ సరసన బాలీవుడ్ నటి తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రకాష్ రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# సంక్రాంతి బరి నుంచి చిరు తప్పుకున్నారా ?



ఒకప్పుడు సంక్రాంతి అంటే తెలుగు సినీ పరిశ్రమకు పెద్ద పండుగగా భావించేవారు. ఆ సీజన్‌లో సినిమా విడుదలైతే భారీ వసూళ్లు ఖాయమనే నమ్మకం నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లలో ఉండేది. కానీ గత కొన్నేళ్లుగా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఒకేసారి పలువురు స్టార్ హీరోల సినిమాలు బరిలోకి దిగుతుండటంతో థియేటర్ల కోసం తీవ్ర పోటీ నెలకొంటోంది. ఫలితంగా స్క్రీన్లు పంచు కోవాల్సి రావడం, కలెక్షన్లు విడిపోవడం వల్ల ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రంపై ఓ ఆసక్తికర ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మొదట ఈ సినిమాను సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని చిత్రబృందం భావించినప్పటికీ, ప్రస్తుతం ఆ నిర్ణయాన్ని పునఃసమీక్షిస్తున్నట్లు టాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద గరిష్ట స్థాయిలో వసూళ్లు రావాలంటే పోటీ లేకుండా సోలోగా విడుదల చేయడం ఉత్తమమనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు సమాచారం. సంక్రాంతి సమయంలో కనీసం రెండు లేదా మూడు పెద్ద సినిమాలు విడుదలయ్యే అవకాశాలు ఉండటంతో, కలెక్షన్లపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారట. అందుకే సంక్రాంతి రేసు నుంచి తప్పుకుని సమ్మర్ లేదా మరో అనుకూలమైన ఫెస్టివల్ సీజన్‌లో సినిమాను విడుదల చేసే అంశంపై అంతర్గతంగా చర్చలు జరుగుతున్నాయని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ఈ ప్రచారాలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# వారానికి 4 రోజులే పనా?.. భారతదేశానికి అది సాధ్యం కాదు: నటుడు విక్రాంత్ మాస్సే


ఉత్తర యూరప్ దేశాల్లో మాదిరిగా వారానికి నాలుగు రోజులే పనిచేసే 'ఫోర్-డే వర్క్ వీక్' నమూనా ప్రస్తుతానికి భారతదేశానికి అస్సలు సరిపడదని ప్రముఖ నటుడు విక్రాంత్ మాస్సే అభిప్రాయపడ్డారు. తన రాబోయే వెబ్ సిరీస్ 'ముసాఫిర్ కేఫ్' ప్రమోషన్ల సందర్భంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన పనివేళలు, వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై తన స్పష్టమైన అభిప్రాయాలను పంచుకున్నారు. మనది ఇంకా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని, యువ ప్రతిభ కలిగిన ఈ ప్రజాస్వామ్య దేశం అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి వచ్చే 40 నుంచి 50 ఏళ్ల పాటు ఎంతో కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్యంగా వినోద పరిశ్రమ గురించి మాట్లాడిన విక్రాంత్, సినీ నిర్మాణం అత్యంత వ్యయంతో కూడుకున్న వ్యవహారమని వ్యాఖ్యానించారు. షూటింగ్‌లో 12 గంటల షిఫ్ట్ ఉన్నప్పటికీ, నిజానికి కేవలం నాలుగు లేదా ఐదు గంటలు మాత్రమే కెమెరా ముందు పనిచేస్తామని వివరించారు. బడ్జెట్ పరిమితులు, ప్రాక్టికల్ పరిస్థితుల కారణంగా కొన్నిసార్లు 16 నుంచి 17 గంటలు కూడా పనిచేయాల్సి వస్తుందని తెలిపారు. రుచిర్ అరుణ్ దర్శకత్వంలో మహిమా మక్వానా, వేదిక పింటోలతో కలిసి విక్రాంత్ నటించిన ప్రేమకథా చిత్రం 'ముసాఫిర్ కేఫ్' జులై 24న నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో విడుదల కానుంది. ఇందులో చందర్ పాత్రలో తన నటన కొత్త భావోద్వేగాలను ఆవిష్కరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# విజయ్ 'జన నాయగన్'పై అనిల్ రావిపూడి ఆసక్తికర వ్యాఖ్యలు


తమిళనాడు ముఖ్యమంత్రి, స్టార్ హీరో విజయ్ నటించిన పొలిటికల్ డ్రామా 'జన నాయగన్' చిత్రంపై టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తెలుగు, తమిళ సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ సినిమాపై ఆయన తన అభిప్రాయాలను పంచుకోవడంతో సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు దీనిపై జోరుగా చర్చిస్తున్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ, 'జన నాయగన్' చిత్రంపై తనకున్న అంచనాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలు ప్రేక్షకుల్లో తీవ్ర కుతూహలాన్ని పెంచుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. విజయ్ సినిమాపై మరో పరిశ్రమకు చెందిన ప్రముఖ దర్శకుడు ఈ విధంగా స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. నందమూరి బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'భగవంత్ కేసరి' చిత్రమే ఈ సినిమాకు స్ఫూర్తి అని దర్శకుడు హెచ్. వినోద్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన అనిల్ రావిపూడి భగవంత్ కేసరిలోని కొన్ని సన్నివేశాలను మాత్రమే 'జన నాయగన్' కోసం తీసుకున్నారని స్పష్టం చేశారు. విజయ్ స్టార్‌డమ్‌కు తగిన రీతిలో దర్శకుడు వినోద్ ఈ చిత్రాన్ని అత్యద్భుతంగా తెరకెక్కించారని ఆయన కొనియాడారు.






# నన్ను అపార్థం చేసుకున్నారు

## నాకెలాంటి సర్జరీ జరగలేదన్న బిగ్‌బి



బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఇటీవల చేసిన సోషల్ మీడియా పోస్ట్ దేశవ్యాప్తంగా ఆందోళనకు గురిచేసిన సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స, ఐసీయూ, కోలుకునే పక్రియ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలతో అమితాబ్‌కు సర్జరీ జరిగిందని అభిమానులు భావించారు. అయితే ఈ ప్రచారాలపై తాజాగా ఆయన స్వయంగా స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. బిగ్ బీ తన బ్లాగ్‌లో శస్త్రచికిత్స అనంతరం కోలుకోవడం ఎంత కష్టమో వివరిస్తూ ఓ పోస్ట్ చేశారు. దీంతో ఆయన ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందారని, సర్జరీ చేయించుకున్నారని వార్తలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆ పోస్టు వెనుక అసలు ఉద్దేశాన్ని అమితాబ్ వివరించారు. నాకు ఎలాంటి శస్త్రచికిత్స జరగలేదు. నేను పూర్తిగా ఆరోగ్యంగానే ఉన్నాను. నా పోస్ట్‌ను చాలా మంది తప్పుగా అర్థం చేసుకున్నారు అని ఆయన స్పష్టం చేశారు. శస్త్రచికిత్స తర్వాత ఐసీయూ నుంచి ఇంటికి వచ్చిన వ్యక్తి ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితులను కేవలం ఒక ఉదాహరణగా మాత్రమే ప్రస్తావించానని చెప్పారు. ఇటీవల జరిగిన అర్జెంటీనా?స్పెయిన్ ఫిఫా మ్యాచ్‌ను ఉద్దేశించే ఆ వ్యాఖ్యలు చేశానని అమితాబ్ వెల్లడించారు. ఒక ఛాంపియన్ ఓడిపోయిన తర్వాత తిరిగి నిలబడటం ఎంత కష్టమో చెప్పాలనుకున్నాను. ఫిఫా ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో అర్జెంటీనా ఓడిన తర్వాత మెస్సి పరిస్థితిని ఊహించుకుని ఆ పోస్ట్ రాశాను. కానీ, అది నా ఆరోగ్యానికి సంబంధించినదిగా అందరూ భావించారు అని వివరించారు. అమితాబ్ ఇచ్చిన ఈ వివరణతో అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు.

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569